నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 10-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:86 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

మురిసెడి తెలగాణముకై
చెరువుల పునరుద్ధరింప చేయుట కొరకై
కరవును తొలగించుటకై
వరగుణుడగు ముఖ్యమంత్రి పథకమ్ము నిడెన్ !!

(ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించడానికి, కరువును తగ్గించడానికి,చెరువుల వంటి నీటి వనరులను పునరుద్ధరించడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి క్రొత్త పథకాన్ని ప్రారంభించారు.)


-రాధశ్రీ
సెల్:9494481210



చుట్టూరా సమస్యల
సముద్ర ఘోష తరంగాలు
ఐనా ఎలా ఊహలన్నీ
ఆకాశంలో విహంగాలు.
భ్రమాత్మక అందలాల్లో
బ్రతికేవు ఎన్నాళ్లు
సాముచేస్తే నేల విడిచి
సమసిపోవు కన్నీళ్లు.

చురక

-వేల్పుల నారాయణ
9440433475



రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అన్ని రంగాల్లో జిల్లాల అభివృద్ధి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన
ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కృషి
పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి.. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాల అభివృద్ధికి చర్యలు

కరీంనగర్, నవంబర్ 9: ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల అనంతరం అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



అన్నారు. వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్‌లో యూడీఐఎఫ్ నిధులు రూ. 1.5 కోట్లతో చేపట్టనున్న బాక్స్ టైప్ డ్రెయిన్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై పలు అంశాలను వెల్లడించారు.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయి, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, గోదావరి జలసంపదతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు అభివృద్ధిలో అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వనరులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

విద్యారంగ అభివృద్ధిలో భాగంగా భీమదేవరపల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు మంత్రి వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. జమ్మికుంట, హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు వైద్యరంగాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, కొత్తకొండ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎలగందుల ఖిల్లాతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలు, జలవనరుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విద్య, వైద్యం, పారిశ్రామిక పార్కులు, మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా ఉమ్మడి కరీంనగర్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

కరీంనగర్ నగరంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం దాదాపు వెయ్యి కొత్త పోస్టుల భర్తీకి ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. కరీంనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరినట్లు వెల్లడించారు.

అభివృద్ధిలో జర్నలిస్టులూ భాగస్వాములు కావాలి

ప్రజలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లాకు అవసరమైన అభివృద్ధి పనులపై జర్నలిస్టులు కూడా తమ సూచనలు అందిస్తూ భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధిగా జిల్లా అభివృద్ధికి పాటుపడటం తన బాధ్యతని, ప్రజల ఆశీర్వాదంతో ఆ బాధ్యతను నెరవేరుస్తానని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతో పాటు పలువురు ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యూపీ ఎన్నికలు.. 209 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు



న్యూ ఢిల్లీ, నవంబర్ 9: వచ్చే ఏడాది యూపీ ఎన్నికలకు అధికార బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దీపావళి ముగిసిన వెంటనే కార్యరంగంలోకి దిగింది. ఇప్పటికే 209 స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తుది అనుమతుల కోసం ఈ జాబితాను కేంద్ర నాయకత్వానికి పంపించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 300 పైచిలుకు స్థానాల్లో విజయం సాధించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టే లక్ష్యంగా బీజేపీ పడివడిగా అడుగులు వేస్తోంది.

దీపావళి ముగిసిన మరుసటి రోజే రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించింది. మొత్తం 403 స్థానాలకు గాను 209 స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు ప్రచారానికి, ప్రజలతో మమేకం అయ్యేందుకు తగినంత సమయం ఉండాలనే లక్ష్యంతో ముందుగా అభ్యర్థుల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసినట్టు సమాచారం.

జాతీయ మీడియా కథనాల ప్రకారం, తొలి దశలో అభ్యర్థులుగా ఖరారైన వారిని ఏ కేటగిరీగా పార్టీ పరిగణిస్తోందని సమాచారం. సీఎం యోగితో సమాలోచనల అనంతరం వీరి పేర్లు ఖరారయ్యాయి. కేంద్ర నాయకత్వం నుంచి తుది అనుమతులు రాగానే అభ్యర్థులకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకునేందుకు రాష్ట్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈసారి ఎన్నికల్లో పార్టీ నాయకత్వం రాష్ట్రంలోని మహిళా ఓటర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టే అవకాశం ఉంది.

ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన



డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ఫ్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –
పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ
(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)
వేదిక : పెన్షనర్ల భవనం
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం

సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పాడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

ప్రోరోగ్ కాకుండా 88 రోజులుగా వర్షాకాల సమావేశాలు.. పార్లమెంట్‌లో కొత్త రికార్డు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొత్త రికార్డు నమోదు అయ్యింది. ఉభయసభలు 88 రోజులుగా వాయిదా పడ్డాయి. ఆగస్టు 13వ తేదీన పార్లమెంట్‌ను వాయిదా వేశారు. కానీ ఆ సమావేశాలను ముగించినట్లు ప్రకటించలేదు. దీంతో 2008లో నమోదు అయిన 87 రోజుల రికార్డును ఇప్పుడు పార్లమెంట్ బ్రేక్ చేసింది. పార్లమెంట్ సమావేశాలను రద్దు చేయకుండా కొంతకాలం వాయిదా వేయడాన్ని ప్రోరోగ్ అంటారు. సోమవారం నాటికి లోక్‌సభ కానీ, రాజ్యసభ కానీ ఇంకా అధికారికంగా ప్రోరోగ్ కాలేదు. దీని ద్వారా వర్షాకాల సమావేశాలను స్వల్ప వ్యవధి కోసం మళ్లీ నిర్వహిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. షార్ట్ నోటీసు ఇచ్చి పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తారని భావిస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు, లోక్‌సభ సీట్ల పునర్ విభజన బిల్లులను ఆమోదింపచేసేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ప్రతిపాదిత బిల్లు ద్వార లోక్‌సభ సీట్లను 543 నుంచి 850కి పెంచనున్నారు. ప్రస్తుత సెషన్‌లోనే సమావేశాలను పొడిగించాలంటే కనీసం రెండు రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది, లేదంటే కొత్త సెషన్ కోసం అయితే కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి వస్తుంది. ఒకసారి సభలు నిరవధిక వాయిదా పడితే, ఆ సమావేశాలను రద్దు చేసేందుకు రాజ్యాంగం ప్రకారం ఎటువంటి నిర్దేశిత సమయ నియమం లేదు.

హైదరాబాద్ విద్యార్థి ఆత్మహత్య కేసులో కీలక మలుపు..

హైదరాబాద్, నవంబర్ 9: నగరంలోని ఎన్ఆర్ నగర్‌కు చెందిన ఓ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. తాను చేసిన తప్పును అంగీకరించినప్పటికీ.. ప్రిన్సిపల్, లెక్చరర్ వేధిస్తున్నారని మనస్తాపం చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి విద్యార్థులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు ప్రిన్సిపల్, లెక్చరర్లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..

కుటుంబసభ్యులు, తోటి విద్యార్థుల కథనం ప్రకారం.. భాను ప్రసాద్ రెడ్డి అనే యువకుడు.. హైదరాబాద్‌లోని ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్‌లో కోర్సు తీను కుంటున్నారు. కాగా.. భాను ప్రసాద్ సరదాగా.. ఓ మహిళా లెక్చరర్ ఫొటోను ఏఐని వినియోగించి మార్ఫింగ్ చేశారు. ఇది తెలుసుకున్న ఆ లెక్చరర్ విద్యార్థి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకుని.. ప్రిన్సిపల్ చంద్రమోహన్‌కు అందజేశారు. దీంతో పశ్చాత్తాపం చెందిన భానుప్రసాద్.. తన తప్పును అంగీకరించి మహిళా లెక్చరర్, ప్రిన్సిపల్‌ను క్షమాపణ కోరారు. అయినా సరే.. ప్రిన్సిపల్ చంద్రమోహన్, మరో లెక్చరర్ భాస్కర్.. ఫోన్ తిరిగి ఇవ్వకుండా వారం రోజులుగా అట్టిపెట్టుకోవడం, దూషిస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భాను ప్రసాద్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని తోటి విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రిన్సిపల్, లెక్చరర్‌ను అరెస్ట్ చేసి.. కోర్టులో హాజరుపరచగా.. జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

పోచారంలో కల్తీ పాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి.. వ్యాపారి అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 09: నగరంలో కల్తీ పాలు సరఫరా చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని పాల తయారీ కేంద్రంపై సోమవారం అధికారులతో కలిసి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాల వ్యాపారిని అరెస్ట్ చేశారు. పాల తయారీ కేంద్రంలోని యంత్రాలను సీజ్ చేశారు.పాల వ్యాపారిని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను వినియోగించి.. ఈ కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు తమ విచారణలో పాల వ్యాపారి వెల్లడించారని పోలీసులు తెలిపారు. ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడని పోలీసులు చెప్పారు.

దీపావళి వేడుకల అనంతరం ఢిల్లీ వాతావరణ పరిస్థితి దారుణం..

న్యూ ఢిల్లీ, నవంబర్ 9: దేశ రాజధాని ఢిల్లీలో దీపావళి వేడుకల అనంతరం వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. బాణసంచా కాల్చడంపై ఆంక్షలు ఉన్నప్పటికీ.. వాటి వినియోగం తగ్గకపోవడంతో గాలి నాణ్యత మరింత దిగజారింది. ఈ ఏడాది దీపావళి రోజున గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత స్థాయిలో కాలుష్యం నమోదైంది. సోమవారం ఉదయం కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. నగరమంతా దట్టమైన పొగమంచు, పొగ కలిసి కమ్ముకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం.. నవంబర్ 8న దీపావళి రోజున ఢిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 376గా నమోదైంది. 2021 తర్వాత దీపావళి రోజున నమోదైన అత్యధిక స్థాయి ఇదే. గత ఏడాది దీపావళి సందర్భంగా ఏక్యూఐ 345గా ఉండగా.. 2024లో 328, 2023లో 218, 2022లో 312గా నమోదైంది. ఈ ఏడాది మాత్రం కాలుష్యం గణనీయంగా పెరిగింది.

సోమవారం ఉదయం 10 గంటల సమయానికి ఢిల్లీ మొత్తం ఏక్యూఐ 371గా నమోదైంది. నగరంలోని 51 పర్యవేక్షణ కేంద్రాల్లో 14 చోట్ల గాలి నాణ్యత తీవ్ర స్థాయిలో ఉండగా.. 33 కేంద్రాల్లో అత్యంత అధ్వాన్న స్థాయిలో నమోదైంది. మరో నాలుగు కేంద్రాల్లో పూర్ కేటగిరీకి చేరింది. ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ పరిసరాల్లో అత్యధికంగా 439 ఏక్యూఐ నమోదైంది.

కాలుష్యానికి తోడు పొగమంచు కూడా ఢిల్లీ వాసులను ఇబ్బందులకు గురిచేసింది. సోమవారం తెల్లవారుజామున సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు దృశ్యమానత కేవలం 50 మీటర్లకు పడిపోయింది. పాలం ప్రాంతంలో 400 మీటర్లుగా నమోదైంది. పొగ, పొగమంచు కలిసి నగరాన్ని కమ్ముకోవడంతో రహదారులపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, గాలుల వేగం తక్కువగా ఉండటం, వాహనాల నుంచి వెలువడే పొగ, బాణసంచా వినియోగం, పొరుగు రాష్ట్రాల్లో వంట వ్యర్థాలను తగులబెట్టడం వంటి అంశాలు కాలుష్యం పెరగడానికి కారణమవుతున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లోనూ ఢిల్లీలో గాలి నాణ్యత తీవ్ర స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని ఎయిర్ క్వాలిటీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ అంచనా వేసింది.

1,616 మంది స్పెషలిస్ట్‌ల నియామకంతో ఇక జిల్లాల్లోనే మెరుగైన వైద్యం.. మంత్రి దామోదర



హైదరాబాద్, నవంబర్ 9: సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా.. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థ బలోపేతానికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టినట్లు తెలిపారు.

30, 50, 100 పడకల ఆసుపత్రులకు వేర్వేరు వైద్య సేవల ప్రణాళికను రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఐపీహెచ్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. చిన్న చిన్న వైద్య సమస్యలకూ హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితి తగ్గించడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

చేతిలో పేలిన క్రాకర్స్.. ఛాతికి తగలడంతో బాలుడు మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 9:దీపావళి రోజున ఒక బాలుడి చేతిలో బాణసంచా పేలింది. అతడి ఛాతికి అది తగలడంతో ఆ బాలుడు మరణించాడు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. దేశ రాజధాని ఢిల్లీలోని నరేలా ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. దీపావళి సందర్భంగా ఆదివారం రాత్రి పదేళ్ల రిషి తన కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చాడు. 'స్కై రాకెట్'ను ఆ బాలుడు వెలిగిస్తుండగా చేతిలో అది పేలింది. అలాగే అది పైకి వెళ్లకుండా నేరుగా బాలుడి ఛాతికి బలంగా తగలడంతో అతడు కుప్పకూలిపోయాడు.కాగా, ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రిషిని వెంటనే నరేలాలోని సత్యవాది రాజా హరీశ్ చంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆ బాలుడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. అయితే వైద్య నిర్లక్ష్యం కారణంగానే రిషి మరణించినట్లు అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.మరోవైపు దీపావళి రోజున ఢిల్లీ అగ్నిమాపక విభాగానికి 257 అత్యవసర కాల్స్ వచ్చాయి. వీటిలో 214 కాల్స్ అగ్నిప్రమాదాలకు సంబంధించినవి కాగా, 24 కాల్స్ బాణసంచాకు సంబంధించినవి. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య అత్యధికంగా 85 అత్యవసర కాల్స్ వచ్చాయని అగ్నిమాపక అధికారి తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి మధ్య మరో 61 కాల్స్ వచ్చాయని చెప్పారు. అగ్నిప్రమాద సంఘటనలకు స్పందించిన అగ్నిమాపక సిబ్బందిలో ఐదుగురు గాయపడినట్లు వివరించారు.

తెలుగు సాహిత్య సామాజిక చైతన్య రచయిత రావి శాస్త్రి

నవంబర్ 10.. రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతి

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, మార్పు మరియు ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన గొప్ప రచయిత రావి శాస్త్రి.

రావి శాస్త్రి పూర్తి పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఆయన ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళంలో 1922 జులై 30న జన్మించారు. తండ్రి న్యాయవాది కావడంతో చిన్నప్పటి నుంచే న్యాయశాస్త్రం పట్ల కలిగి ఉన్న ఆసక్తి తరువాత ఆయన రచనా జీవితానికి కూడా దోహద పడింది.

రావి శాస్త్రి ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి తత్వశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. తరువాత మద్రాసు విశ్వ విద్యాలయంలో న్యాయశాస్త్రం చదివి న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అయితే, ఆయనకు సాహిత్యంపై ఉన్న మక్కువతో పాటు, సమాజంలో ఉన్న అన్యాయాలపై, నిర్దయ జీవన శైలిపై తన గొంతును వినిపించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాహిత్యాన్ని ఆయుధంగా ఉపయోగించి, ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారు.

రావి శాస్త్రి రచనలు సామాజిక సమస్యలను, ప్రజల చైతన్యాన్ని, పీడిత వర్గాల బాధలను ప్రతిబింబించాయి. న్యాయవాదిగా వృత్తి ఎన్నుకున్నా, ప్రజల సమస్యలు, పేదల వేదనలు, అన్యాయం ఎలా ఉన్నాయో సాహిత్యం ద్వారా వెల్లడించాలని ఆయన అనుకున్నారు. రచనలలో ఉత్తరాంధ్ర మాండలికాన్ని సహజమైన శైలిలో ఉపయోగించడం రావి శాస్త్రి సాహిత్యంలో ఒక ప్రత్యేకతగా నిలిచింది.

రావి శాస్త్రి రచనల ప్రధాన లక్ష్యం సమాజంలోని అసమానతలను, అన్యాయాలను ఎండగొట్టడం. ఆయన కథలు ప్రజలలో చైతన్యం కలిగించే శక్తివంతమైన సాధనాలుగా నిలిచాయి.

ఆయన రచనలలో గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, వివిధ వర్గాల ప్రజల అనుభవాలు, జీవిత కష్టాలు, ఆనందాలు ప్రతిఫలిస్తాయి.

ఉత్తరాంధ్ర మాండలికాన్ని తన రచనలలో సహజంగా, అందంగా వాడారు. భాషలో సరళత్వం, సహజత్వం ఉండటంతో పాఠకులకు ఆ రచనలు నేరుగా హృదయానికి తాకుతాయి. రావి శాస్త్రి రచనలలో ప్రజల మధ్య విభజనలు, కుల వివక్షలు, ధనవంతులు-పేదల మధ్య వ్యత్యాసాలు వంటి అంశాలను తీవ్రంగా ప్రస్తావించి, సమాజంలో మార్పు రావాలని కోరుకున్నారు.

రావి శాస్త్రి అనేక ప్రసిద్ధ రచనలు చేసి, తెలుగు సాహిత్యంలో తన కీర్తిని నిలబెట్టుకున్నారు. ఆయన రచనలలో ముఖ్యమైనవి...కథా సాగరం, ఆరు సారా కథలు, రాజు మహిషి, కలకంఠ, బానిస కథలు, ఋక్కులు, గోవులు వస్తున్నాయి జాగ్రత్త, బంగారం మొదలైనవి.

రావి శాస్త్రి రచనలు ప్రజల మనసును కదిలించే శక్తిని కలిగి ఉంటాయి. సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రజల జీవన సవాళ్లను అర్థం చేసుకునేలా ఆయన రచనలు నిలుస్తాయి. ఆయన రచనలు సాహిత్యానికి కొత్త ధోరణులను పరిచయం చేస్తూ, ప్రజలలో సామాజిక చైతన్యాన్ని పెంచేందుకు గొప్ప పాత్ర పోషిస్తాయి.

రావి శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విప్లవాత్మక రచయితగా, సామాజిక మార్పునకు సూచికగా నిలిచారు. ఆయన రచనలు ఇప్పటికీ పాఠకుల హృదయాలలో సజీవంగా ఉన్నాయి. ప్రజల సమస్యలను ఎండగొట్టి, సాంఘిక చైతన్యం కలిగించిన రచయితగా రావి శాస్త్రిని ఎప్పటికీ గౌరవంతో స్మరించు కుంటారు.



-మధుపాళీ
9949700037

ఐఎఫ్ఎఫ్ఐ గోవా-2026 వేదికగా జరిగే 'వేవ్స్ బజార్'లో పాల్గొనేందుకు అంకుర సంస్థలను ఆహ్వానిస్తున్న వేవ్ఎక్స్

న్యూఢిల్లీ, నవంబర్ 9:గోవా వేదికగా జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) సందర్భంగా ఏర్పాటు చేసే 'వేవ్స్ బజార్'లోని 'వేవ్ఎక్స్ స్టార్టప్ పెవిలియన్'లో పాల్గొనేందుకు చలనచిత్ర రంగం, అనుబంధ సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న అంకుర సంస్థల నుంచి భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

వినూత్న అంకుర సంస్థలు తమ ఉత్పత్తులు, సాంకేతికతలు, పరిష్కారాలను... జాతీయ, అంతర్జాతీయ చలనచిత్ర, మీడియా పరిశ్రమ సమక్షంలో ప్రదర్శించేందుకు ఒక ప్రత్యేక వేదికను అందించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఇది ప్రపంచ సృజనాత్మక వ్యవస్థలోని చిత్ర రూపకర్తలు, నిర్మాణ సంస్థలు, పెట్టుబడిదారులు... నెట్వర్కింగ్, పరిశ్రమతో మమేకమవడం, పరస్పరం సహకరించుకోవడం కోసం అవకాశాలను సులభతరం చేస్తుంది.

ఫిల్మ్, సంబంధిత టెక్నాలజీ రంగాల్లో పనిచేస్తూ, డీపీఐఐటీలో నమోదైన అంకుర సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వేవ్ఎక్స్ ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ నిర్వహించే స్క్రీనింగ్, మూల్యాంకన ప్రక్రియ ద్వారా అర్హతగల అంకురసంస్థలను ఎంపిక చేస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అంకుర సంస్థలు ఈ కార్యక్రమం కోసం దరఖాస్తు చేసుకోవాలని... అంతర్జాతీయ వేదికపై తమ ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

1952లో స్థాపించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)... ఆసియాలోని ప్రముఖ చలన చిత్రోత్సవాల్లో ఒకటి. ఇది ప్రపంచ సినిమా శ్రేష్ఠతను చాటుతూ... భారత్తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రరూపకర్తలు, కళాకారులు, నిర్మాతలు, సినీ ప్రియుల కోసం ఒక వేదికను అందిస్తుంది. ప్రతి సంవత్సరం గోవాలో జరిగే ఐఎఫ్ఎఫ్ఐ... ప్రపంచ సినీ పరిశ్రమను ఒకచోట చేర్చుతుంది. విభిన్న చిత్రాలను ప్రదర్శిస్తుంది. సృజనాత్మకతను పరస్పరం పంచుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. సినీ రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిస్తుంది.

వేవ్ఎక్స్ (వేవ్స్ స్టార్టప్ యాక్సిలరేటర్) కార్యక్రమం... భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ రూపొందించిన ఒక స్టార్టప్ యాక్సిలరేటర్, ఇంక్యుబేషన్ కార్యక్రమం. ఇది మీడియా, వినోద రంగంలో ఆవిష్కరణలు, వ్యవస్థాపన, వర్ధమాన ప్రతిభను ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. ఇది యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్టెండెడ్ రియాలిటీ (ఏవీసీజీ-ఎక్స్ఆర్), మీడియా టెక్నాలజీస్ వంటి రంగాల్లో పనిచేస్తున్న అంకుర సంస్థలకు అండగా నిలుస్తోంది.

నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగానే... ఓఎంసీలు సరఫరా చేసిన ఈ20 పెట్రోల్

న్యూఢిల్లీ, నవంబర్ 9:కర్ణాటక ప్రభుత్వానికి చెందిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, లీగల్ మెట్రాలజీ విభాగం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పందించింది. రాష్ట్రంలోని కొన్ని రిటైల్ విక్రయ కేంద్రాల్లో విక్రయిస్తున్న పెట్రోల్లో 26 శాతం నుంచి 31 శాతం వరకు ఇథనాల్ కలిసి ఉందని ఆ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రకటనలో నివేదించిన వాదనలకు నిర్దేశిత చట్టబద్ధమైన, సాంకేతిక ప్రక్రియలకు అనుగుణంగా నిర్వహించిన పరీక్షల మద్దతు లేదని మూడు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన (ఓఎంసీలు) ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్పీసీఎల్) లు స్పష్టం చేశాయి. కర్ణాటకతో సహా దేశవ్యాప్తంగా ఈ మూడు ఓఎంసీలు సరఫరా చేసే ఈ20 పెట్రోల్... ఇథనాల్-మిశ్రిత మోటార్ గ్యాసోలిన్ కోసం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ఐఎస్ 17021 ప్రమాణానికి అనుగుణంగా ఉంది.

నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద జారీ చేసిన మోటార్ స్పిరిట్, హై స్పీడ్ డీజిల్ (సరఫరా, పంపిణీ నియంత్రణ, అపకతవకల నివారణ) ఉత్తర్వులు-2005, మార్కెటింగ్ క్రమశిక్షణ మార్గదర్శకాలు (ఎండీజీ)-2024తో కలిపి చదివినప్పుడు... అది నమూనా సేకరణ, రిటెన్షన్, పరీక్ష, ఫలితాల కమ్యూనికేషన్ కోసం ఒక నిర్దిష్ట విధానాన్ని నిర్దేశిస్తుంది.

నిర్దేశించిన విధానం ప్రకారం ఒక-లీటరు నమూనాలు ఆరింటిని సేకరించాలి. వాటిలో రెండు నమూనాలను డీలర్కు రసీదుపై అందజేయాలి. రెండు నమూనాలను చమురు కంపెనీ లేదా విభాగం వద్ద ఉంచాలి. మరో రెండు నమూనాలను నియంత్రణ ఉత్తర్వుల షెడ్యూల్ ఎఎఏ కింద నిర్దేశించిన లేదా అధికారిక గెజిట్లో తెలియజేసిన ప్రయోగశాలకు పంపాలి. నమూనా లేబుళ్లపై ఉమ్మడిగా సంతకం చేయాలి. పరీక్ష ఫలితాలను నిర్దేశించిన కాలపరిమితిలోగా డీలర్కు, చమురు కంపెనీకి తెలియజేయాలి.

సెప్టెంబర్-2026 కార్యక్రమంలో సేకరించిన నమూనాలను రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ ద్వారా నిర్దేశిత ఓఎంసీ ప్రయోగశాలలకు పంపి, ఎండీజీ-2024 కింద కోరిన నాణ్యతా ప్రమాణాల కోసం పరీక్షించారు. అయితే అక్టోబర్లో జరిగిన తదుపరి కార్యక్రమంలో ఓఎంసీ ప్రతినిధుల భాగస్వామ్యం లేకుండానే నమూనాలను సేకరించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ ద్వారా కోరినప్పటికీ... ఓఎంసీలకు సంబంధిత రిటెన్షన్ నమూనాలు, అవుట్లెట్ల వారీగా పూర్తి వివరాలు లేదా ప్రయోగశాల నివేదికలనూ అందించ లేదు.

నియంత్రణ ఉత్తర్వుల కింద నిర్దేశించిన ప్రయోగశాలల్లో నిర్వహించిన పరీక్షలకు బదులుగా... ఒక థర్డ్-పార్టీ ప్రయోగశాల జారీ చేసిన సర్టిఫికేట్లపైనే ఈ నివేదిక ఫలితాలు ఆధారపడి ఉన్నాయని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పేర్కొన్నాయి. నివేదించిన ఇథనాల్ కంటెంట్ను స్వతంత్రంగా ధ్రువీకరించడానికి అవసరమైన పూర్తి సాంకేతిక వివరాలను ఆ సర్టిఫికేట్లు అందించడం లేదు. దానికి సమానమైన నమూనాలు, నిర్దేశించిన డాక్యుమెంటేషన్ లేకపోవడం వల్ల... ధ్రువీకరణ లేదా పునఃపరీక్ష కోరే అవకాశాన్నీ ఓఎంసీలు, సంబంధిత డీలర్లు కోల్పోయారు.

ఓఎంసీలు నిర్వహించిన ప్రాథమిక సాంకేతిక అంచనాలో... ధ్రువీకరణ పత్రాల్లో పేర్కొన్న ఇథనాల్ పరీక్ష పద్ధతికి సంబంధించి కొన్ని ఆందోళనలు వెల్లడయ్యాయి.

ఐఎస్ 17021:2018 (సవరణ సంఖ్య 3, ఆగస్టు-2025) ప్రకారం, ఈ20 ఇంధనంలోని ఇథనాల్ శాతాన్ని నిర్ణయించడానికి నిర్దేశిత పద్ధతులను అనుసరించాలి. అవి ఏఎస్టీఎం డీ5845 ప్రమాణం కింద 'ఫోరియర్ ట్రాన్స్ఫార్మ్ ఇన్ఫ్రారెడ్ స్పెక్ట్రోస్కోపీ' (ఎఫ్టీఐఆర్)... అనుబంధం ఆ లో పేర్కొన్న 'వాటర్ ఎక్స్ట్రాక్షన్' (నీటి ద్వారా సంగ్రహణ) పద్ధతి, లేదా ఏఎస్టీఎం డీ4815/డీ6839 ప్రమాణాల కింద 'గ్యాస్ క్రోమాటోగ్రఫీ' పద్ధతి.

ముఖ్యంగా, ఏఎస్టీఎం డీ4815/డీ6839 ప్రకారం గ్యాస్ క్రోమాటోగ్రఫీని ఉపయోగించినప్పుడు, నమూనాను మొదట ఆక్సిజనేట్-రహిత పెట్రోల్తో 1:1 నిష్పత్తిలో విలీనం చేయాలి. ఫలితాన్ని ఈ10 ధ్రువీకరించిన రిఫరెన్స్ మెటీరియల్ ఉపయోగించి సరిదిద్దాలి.

కర్ణాటక పత్రికా ప్రకటనలో ఉదహరించిన ధ్రువపత్రాలు... పర్తించే ప్రామాణిక పరీక్ష పద్ధతిని, సూచించిన విలీనీకరణ విధానాన్ని లేదా సవరణ కోసం ఉపయోగించిన రిఫరెన్స్ మెటీరియల్ను పేర్కొనకుండా, కేవలం "గ్యాస్ క్రోమాటోగ్రఫీ ద్వారా ఇథనాల్ శాతం" అని మాత్రమే ప్రస్తావిస్తున్నాయి. ఈ ముఖ్యమైన వివరాలు లేకపోవడం వల్ల, నివేదించిన 26?31 శాతం ఇథనాల్ గణాంకాలను ఐఎస్ 17021 కింద నూచించిన పద్ధతితో స్వతంత్రంగా ధ్రువీకరించడం సాధ్యం కాదు.

నివేదించిన సాంద్రత రీడింగులూ పరిశీలనకు అర్హమైనవే. 26?31 శాతం ఇథనాల్ను కలిగి ఉన్నాయని పేర్కొన్న నమూనాల విషయంలో సంబంధిత ధ్రువ పత్రాలు సాంద్రతను 0.742 నుంచి 0.749 గ్రా/సిసి వరకు సూచిస్తున్నాయి. ఇది క్యూసీసీ-1, క్యూసీసీ-2 సర్వేల కింద ఓఎంసీలు పరీక్షించిన ఈ20 నమూనాల కోసం నమోదైన సాంద్రతలు 0.752?0.760 గ్రా/సిసి కంటే తక్కువ. పెట్రోల్ కంటే ఇథనాల్కు అధిక సాంద్రత ఉన్నందున... ఇథనాల్ నిష్పత్తి ఎక్కువగా ఉంటే మిశ్రమం సాంద్రత సాధారణంగా పెరుగుతుందని భావించవచ్చు. నిర్దేశిత పద్ధతి ద్వారా పరీక్షించడం, తగిన రిఫరెన్స్ నమూనాలతో ధ్రువీకరించాల్సిన ఆవశ్యకతను ఈ వ్యత్యాసం మరింత స్పష్టం చేస్తోంది.

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్టీ)... ఓఎంసీ రిటైల్ అవుట్లెట్ల వ్యాప్తంగా ఇథనాల్ మిశ్రమాన్ని, ఇంధన నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

ఓఎంసీ / సీహెచ్టీ క్వాలిటీ కోఆర్డినేషన్ సెల్ (క్యూసీసీ) ప్రక్రియలో భాగంగా... 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఐఓసీఎల్ (330), బీపీసీఎల్ (280), హెచ్పీసీఎల్ (283) డిపోలు, రిటైల్ అవుట్లెట్ల నుంచి 893 ఈ20 నమూనాలను సేకరించారు. రిఫైనరీ, ఓఎంసీ క్వాలిటీ-కంట్రోల్ ప్రయోగశాలల్లో ఐఎస్ 17021, అనుబంధం ఆ ప్రమాణాల ప్రకారం ఈ నమూనాల్లోని ఇథనాల్ శాతం కోసం పరీక్షించారు. ఈ 893 నమూనాల స్నింటిలోనూ ఇథనాల్ శాతం నిర్దేశిత పరిధి 19?21 శాతం మధ్యే ఉన్నట్లు తేలింది.

వివిధ ప్రాంతాల నుంచి, మూడు చమురు మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) నుంచి సేకరించిన మొత్తం 56 నమూనాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయి. వీటిలో ఇథనాల్ శాతం 19 శాతం నుంచి 20 శాతం మధ్య ఉండగా, సగటున ఇది 19.30 శాతంగా నమోదైంది.

ఓఎంసీ రిటైల్ అవుట్లెట్లలో ఇథనాల్ మిశ్రమాన్ని నిర్దేశించిన ప్రమాణాల పరిధిలోనే పర్యవేక్షిస్తున్నారని, నియంత్రిస్తున్నారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. గణనీయంగా అధిక స్థాయిలో ఇథనాల్ ఉన్నట్లు చూపిన కర్ణాటక పత్రికా ప్రకటన... వాస్తవ ఫలితాలతో పొంతన లేకుండా ఉంది. పారదర్శకమైన, సాంకేతికంగా పటిష్ఠమైన, ఉమ్మడిగా ధ్రువీకరించదగిన పరీక్షా ప్రక్రియ ఆవశ్యకతను ఇవి బలపరుస్తున్నాయి.

చమురు మార్కెటింగ్ సంస్థల (ఓఎంసీలు) రిఫైనరీలు, డిపోల్లో పెట్రోల్లో ఇథనాల్ను కలిపే ప్రక్రియ (బ్లెండింగ్)ను నిర్దేశిత ప్రమాణాలు, నియంత్రిత, స్వయంచాలక వ్యవస్థల ద్వారా నిర్వహిస్తారు. రిఫైనరీ, డిపో స్థాయిల్లో నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ నిబంధనలకు కట్టుబడి ఆటోమేటిక్ కాలిబ్రేషన్, నిష్పత్తి ఆధారిత పరికరాల ద్వారా ఈ బ్లెండింగ్ చేపడుతున్నారు. పెట్రోల్లో ఇథనాల్ను కలపడం అనేది మ్యాన్యువల్గా (చేతితో) లేదా ఇష్టారాజ్యంగా చేసే ప్రక్రియ కాదు.

మిశ్రమ ఇంధనం వినియోగదారులకు చేరే ముందే, అది భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉందని నిర్ధారించేందుకు చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) తమ సరఫరా, పంపిణీ వ్యవస్థ లన్నింటిలో పటిష్ఠమైన నాణ్యతా హామీ విధానాలను అమలు చేస్తున్నాయి.వినియోగదారుల వాహనాల్లో ఇథనాల్ తగ్గడం వల్ల ఏటా సుమారు రూ.62,000 కోట్ల నష్టం వాటిల్లుతోందని, వాహనాల మరమ్మతుల కోసం సుమారు రూ.39,000 కోట్లు ఖర్చవుతున్నాయనే వాదనలను కూడా ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాల ప్రాతిపదికన క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు ఖర్చులను కలిపితే మొత్తం సుమారు రూ.1.01 లక్షల కోట్లుగా పేర్కొంటున్నారు.

30 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 4 కోట్ల నాలుగు చక్రాల వాహనాలు మూడేళ్లకు పైగా ఈ20 ఇంధనంతో నడుస్తున్నాయి. ప్రతిరోజూ 6 కోట్ల మందికి పైగా తమ వాహనాల్లో ఇంధనం నింపుకునేందుకు పెట్రోల్ బంకులను సందర్శిస్తున్నారు. ఈ20 ఇంధన నాణ్యతలో ఏవైనా ప్రధాన లోపాలు ఉంటే, ఇంత భారీ సంఖ్యలో ఉన్న వాహన రంగంలో విస్తృతమైన మైలేజ్ లోపాలు లేదా ఇంజన్ వైఫల్యాలు బయటపడి ఉండేవి. అయితే దేశవ్యాప్తంగా అటువంటి నివేదికలేవీ నమోదు కాలేదు. ప్రచారంలో ఉన్న వదంతులకు భిన్నంగా, క్షేత్రస్థాయిలో విస్తృతంగా జరుగుతున్న ఈ వాస్తవ వినియోగమే ఇంధన నాణ్యత, వాహనాల పనితీరుకు నిదర్శనం.


ఈ20 ఇంధనం వల్ల వాహనాల పనితీరు, మైలేజీపై కలిగే ప్రభావాలను అంతర్ మంత్రిత్వ శాఖల కమిటీ పరిశీలించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించిన అధ్యయనాల్లోనూ ఈ అంశాలను విశ్లేషించారు.

పెట్రోల్లో ఇథనాల్ మిశ్రమం (ఈ20) వినియోగం, వాహనాల పనితీరుపై వ్యక్తమవుతున్న అపోహలకు సమాధానంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ద్వారా విడుదల చేసిన అధికారిక నివేదికలో స్పష్టత ఇచ్చింది. ఈ20 ఇంధనానికి అనుగుణంగా ప్రత్యేకంగా కాలిబ్రేట్ చేసిన వాహనాలలో మైలేజ్ తగ్గుదల కేవలం 1 నుంచి 2 శాతం మాత్రమే ఉంటుందని వెల్లడించింది. అలాగే వాహనాల కేటగిరీ, తయారీ కాలిబ్రేషన్ను బట్టి ఇతర కొన్ని వాహనాల్లో మైలేజ్ 3 నుంచి 6 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల, దేశంలోని అన్ని వాహనాల్లో మైలేజీ 10 శాతం తగ్గుతుందని ఏకపక్షంగా అంచనా వేసి, దాని ఆధారంగా వినియోగదారులకు జాతీయ స్థాయిలో రూ.62,000 కోట్ల నష్టం వాటిల్లుతోందని లెక్కించడం శాస్త్రీయంగా నిరూపితమైన అంచనా కాదు. అదేవిధంగా, వాహనాల మరమ్మతుల కోసం రూ.39,000 కోట్లు ఖర్చవుతుందనే అంచనాకు కూడా వాహనాల వాస్తవ పనితీరు సమాచారం, వాహన తయారీలో ఉపయోగించే పదార్థాల ఇంధన అనుకూలతపై అధ్యయనాలు, నమోదైన మరమ్మతుల వ్యయాల ఆధారంగా పారదర్శకమైన మూల్యాంకనం ద్వారా తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది.

వాహనాల తయారీలో ఉపయోగించే పదార్థాల ఇంధన అనుకూలత, వాహనాల పనితీరుకు సంబంధించిన ఆందోళనల ను సాంకేతిక సంస్థలు, ఆటోమొబైల్ పరిశ్రమ భాగస్వామ్యంతో ఇప్పటికే అధ్యయనాల ద్వారా పరిశీలించారు. కాబట్టి, ఈ కార్యక్రమం ప్రభావాన్ని అంచనా వేసేటప్పుడు అన్ని వాహనాలకూ ఒకే విధమైన అంచనాలను వర్తింపజేయకుండా వాహనాల రకం, తయారీ ప్రమాణాలు, ఇంధన అనుకూలత, ఈ సాంకేతిక అధ్యయనాల ఫలితాలను పరిగణనలోకి తీసుకోవాలి.

కష్టాల్లో తోడుగా.. ఆపదలో అండగా మీ ఎమ్మెల్యే

-మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



ఆదిలాబాద్, నవంబర్ 9:అనారోగ్య సమస్యలతో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి వారికి ఆర్థికంగా అండగా గెలుస్తుందని మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు అన్నారు.

మంచిర్యాల నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి వచ్చినటువంటి 130 మంది లబ్ధిదారులకు 50 లక్షల 53 వెల 7వందల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలైన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వం భరోసా కల్పిస్తూ వైద్య ఖర్చులు భరించలేని అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి, ఇతర సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల కష్టాల్లో తోడుగా ఆపదలో అండగా ప్రతి కుటుంబానికి ప్రేమ్ సాగర్ రావు ఉన్నాడు అని జ్ఞాపకం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ పౌరుడు ధరణి మధుకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కార్పొరేటర్, తూముల నరేష్,ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కార్పొరేటర్లు,సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు,మహిళా, యువజన,కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో..



ఆదిలాబాద్, నవంబర్ 9:సెడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా వరి పంటలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్పూర్ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామ సమీపంలోని రాష్ట్ర హైవే పై అటవీశాఖ చెక్పోస్టు వద్ద రాస్తారోకో నిర్వహించారు.

చింతగూడ సింగిల్ విండో వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మ, మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట పొట్ట దశలో ఉందని, నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.

అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక పోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు అందించాలని, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. దీంతో స్థానిక ఎస్ఐ ఉదయ కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ ఆందోళనలో రైతులు లచ్చన్న, సుశీల తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో షార్ట్ సర్క్యూట్ మంటలు

ఎస్ఐ సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం

ఆదిలాబాద్, నవంబర్ 9: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని బస్టాండ్ ప్రధాన వీధిలో విద్యుత్ స్తంభానికి చిలరేగిన షార్ట్ సర్క్యూట్ మంటలు అలజడి రేపాయి. సోమవారం వేకువ జామున 3 గంటల ప్రాంతంలో బస్టాండ్ సమీపంలో విద్యుత్ స్తంభానికి భారీ ఎత్తున మంటలు చెలరేగాయి.

ఆ పక్కనే వ్యాపార దుకాణ సముదాయానికి మంటలు విస్తరిస్తున్న సమయంలో జనం అక్కడ ఎవ్వరు అందుబాటులో లేరు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న లోకేశ్వరం ఎస్సై ప్రదీప్ సిబ్బంది అక్కడికి చేరుకోని బకెట్ల ద్వారా నీటిని తీసుకువచ్చి మంటలు ఆర్పి వేశారు.

ఈ విషయం తెలియగానే పక్కనే ఉన్న కాలనీ వాసులు వచ్చి పోలీసులకు నీళ్లు అందించారు. ఎస్సై ప్రదీప్ స్వయంగా సిబ్బందిని అప్రమత్తం చేస్తూనే సమయస్ఫూర్తితో మంటలు ఆర్పడం కారణంగా బైసాలో భారీ అగ్ని ప్రమాదం ముప్పు తప్పింది. ఈలోగా అగ్నిమాపక శకటం వచ్చే సరికి మంటలు చల్లారాయి. పెను ప్రమాదం తప్పడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకొని ఎస్సై ప్రదీప్ కు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం, టెలికమ్యూనికేషన్ల శాఖ విభాగం డిజిటల్ భారత్ నిధి మధ్య ఒప్పందం

హైదరాబాద్, నవంబర్ 9: తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని వేగవంతం చేయడం దిశగా కీలక ముందడుగు పడింది. సవరించిన భారత్‌నెట్ కార్యక్రమాన్ని (ఏబీపీ) రాష్ట్రంలో అమలు చేయడం కోసం టెలికమ్యూనికేషన్ల శాఖ పరిధిలోని డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్), రాష్ట్ర ప్రభుత్వాల మధ్య న్యూఢిల్లీలోని సంచార్ భవన్‌లో నేడు ఒప్పందం కుదిరింది.

తెలంగాణలో సవరించిన భారత్‌నెట్ కార్యక్రమం అమలు కోసం డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్), టెలికమ్యూనికేషన్ల శాఖ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ గ్రామీణ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఐఐసీఎల్), భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీ-ఫైబర్) మధ్య ఈ ఒప్పందం కుదిరింది.

డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్) అడ్మినిస్ట్రేటర్ శ్రీ శ్యామల్ మిశ్రా సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అనుదీప్ దురిశెట్టి, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ (ఎంటం ప్రైజ్ బిజినెస్) శ్రీ పాపా సుధాకర రావు, టెలికమ్యూనికేషన్ల శాఖ డీడీజీ (ఏబీపీ అమలు?1) శ్రీ దినేశ్ కుమార్ గార్గ్, తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీ-ఫైబర్), తెలంగాణ గ్రామీణ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఐఐసీఎల్) సీఈఓ శ్రీ వేణు ప్రసాద్ పన్నీరు హాజరయ్యారు. టెలికమ్యూనికేషన్ల శాఖ, డిజిటల్ భారత్ నిధి, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఒప్పందంపై సంతకాలు చేయడం ద్వారా కార్యక్రమాన్ని వేగంగా అమలు చేసేందుకు కీలక ముందడుగు పడింది. గ్రామీణ డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, చివరి మైలు వరకు అనుసంధానాన్ని విస్తరించడం, అందరికీ డిజిటల్ వృద్ధి ఫలాలు అందేలా చూడటంలో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి నిబద్ధతను ఈ ఒప్పందం ప్రతిబింబిస్తోంది.

దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలు, గ్రామాలకు అవసరాన్ని బట్టి పటిష్ఠమైన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేందుకు ప్రస్తుతం ఉన్న భారత్ నెట్ నెట్‌వర్క్‌ను ఆధునికీకరించడం, సమీకృతం చేయడం, విస్తరించడం లక్ష్యంగా కేంద్ర మంత్రివర్గం 2023 ఆగస్టు 4న సవరించిన భారత్‌నెట్ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది.

తెలంగాణలో సవరించిన భారత్‌నెట్ కార్యక్రమాన్ని తెలంగాణ గ్రామీణ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఐఐసీఎల్) ద్వారా అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం పరిధిలో మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నెట్‌వర్క్ సామర్థ్యం, విశ్వసనీయతను పెంచేందుకు మొదటి దశలోని 1,946 గ్రామ పంచాయతీల్లో లీనియర్ టోపాలజీని రింగ్ టోపాలజీగా ఉన్నతీకరించడం, రెండో దశలోని 10,787 గ్రామ పంచాయతీలకు నెట్‌వర్క్ విస్తరించడం, కొత్తగా ఏర్పాటైన 36 గ్రామ పంచాయతీలను చేర్చడం ఉన్నాయి.

తెలంగాణలో ఈ కార్యక్రమం అమలుకు భారత ప్రభుత్వం రూ.3,189 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఆమోదించింది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు మూడు లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు కల్పించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఈ-గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, పౌరులకు అవసరమైన ఇతర సేవల అందజేత గణనీయంగా మెరుగుపడుతుందని భావిస్తున్నారు.

నేడు కుదిరిన ఈ ఒప్పందం తెలంగాణలో కార్యక్రమం అమలును వేగవంతం చేయడంతో పాటు, డిజిటల్ సాధికారత కలిగిన సమాజం, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణం దిశగా లక్ష్య సాధనకు మరింత దోహదపడుతుందని భావిస్తున్నారు.

డిజిటల్ భారత్ నిధి (గతంలో యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్?యూఎస్ఓఎఫ్) భారత టెలిగ్రాఫ్ (సవరణ) చట్టం 2003 కింద 01.04.2002 నుంచి అమల్లోకి వచ్చింది టెలిక మ్యూనికేషన్ల చట్టం 2023 ప్రకారం యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ పేరు డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్)గా మారింది. వెనుకబడిన గ్రామీణ, మారుమూల, పట్టణ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ సేవలకు అందుబాటు కల్పించడం, వాటి పంపిణీని ప్రోత్సహించడం ద్వారా సార్వత్రిక సేవా లక్ష్యాన్ని సాధించేందుకు మద్దతు ఇవ్వడం డిజిటల్ భారత్ నిధి ప్రధాన బాధ్యత. ఇది కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలి కమ్యూనికేషన్ల శాఖ (డీఓటీ) అనుబంధ కార్యాలయంగా పనిచేస్తుంది.

డిజిటల్ భారత్ నిధి లక్ష్యాల సాధన కోసం భారత్‌నెట్, 4జీ సంతృప్తి ప్రాజెక్టు, ఆకాంక్షిత జిల్లాల్లోని సేవలు అందని ప్రాంతాలకు మొబైల్ సేవల కల్పన, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ సేవలు, హిమాలయ, సరిహద్దు ప్రాంతాల్లో మొబైల్ సేవలు, దీవుల్లో మొబైల్ సేవలు, ఈశాన్య ప్రాంతాల్లో మొబైల్ సేవలు వంటి పలు పథకాలు, ప్రాజెక్టులను అమలు చేస్తోంది.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశం

-ప్రజావాణికి 32 ఫిర్యాదులు, వినతులు
-ప్రతి అర్జీపై సమగ్ర విచారణ జరపాలి




కరీంనగర్, నవంబర్ 9: ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని తెలిపారు. ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు, వినతులు అందినట్లు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రాధాన్యతతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, డీఆర్వో కె.వై. ప్రసాద్, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ల సమయంలోనూ ప్రజాసేవకే ప్రాధాన్యతమిచ్చాం..

-స్థానిక ఎన్నికల్లో కూటమి జయభేరి..
-ప్రజల తీర్పు మాపై మరింత బాధ్యత పెంచింది
-అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజల ఆశీర్వాదం..
-విశాఖ మేయర్ స్థానంలో భారీ మెజారిటీ



అమరావతి, నవంబర్ 9:స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం తమ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి భద్రత, భరోసా కల్పిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజల తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని స్పష్టం చేశారు.

మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. మార్కాపురంలో 21కి 21, అనకాపల్లిలో 24కి 24 జెడ్పీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకుందని తెలిపారు. విశాఖ మేయర్ స్థానాన్ని 2.50 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో ప్రజలు కట్టబెట్టారని పేర్కొన్నారు. ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే వారు తప్పకుండా అండగా నిలుస్తారని ఈ ఫలితాలు నిరూపించాయని చెప్పారు.

రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. రాయలసీమ కరువును నివారించేలా సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడంతో పాటు, తాలిదశ పనులను ప్రారంభించి రైతుల కష్టాలు తీర్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించామని, ప్రజల ఆకాంక్ష మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలే ఎన్నికల్లో కూటమి విజయానికి దోహదపడ్డాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

ప్రతిపక్ష వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. తాము ప్రజలను, వారి నమ్మకాన్ని విశ్వసిస్తే.. వైసీపీ మాత్రం నేరాలు, ఘోరాలను నమ్ముకుందని ఆరోపించారు. ఎన్నికల్లో హింసను ప్రేరేపిస్తూ, తీవ్రవాదుల తరహాలో హిట్ అండ్ రన్ రాజకీయాలకు పాల్పడిందని విమర్శించారు. హింసాత్మక రాజకీయాలను ప్రజలు ఎప్పుడూ ఆమోదించరని అన్నారు. ఇది రాతియుగం కాదని, రౌడీయిజం, డ్రామాలతో ప్రజా తీర్పును మార్చలేరని వైసీపీ గుర్తించాలని వ్యాఖ్యానించారు.

స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ అంశాలను తెరపైకి తెచ్చి పిటిషన్లు దాఖలు చేసిందని పేర్కొన్నారు. అయితే సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసిందన్నారు. వైసీపీ ట్రాప్‌లో పడబోమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించే పరిస్థితికి ఆ పార్టీ దిగజారిందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రెండు తుఫాన్లు వచ్చిన సమయంలో తమ ప్రభుత్వం ప్రజలను ఆదుకునే పనుల్లో నిమగ్నమైందని చంద్రబాబు తెలిపారు. అయితే ప్రతిపక్షం కనీసం స్పందించలేదని విమర్శించారు. వైసీపీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని ఆరోపించారు.

ఎన్నికల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే తాము అధిక ప్రాధాన్యం ఇచ్చామని, ప్రభుత్వ పనితీరును ప్రజలు గుర్తించి కూటమికి మద్దతుగా నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు

-బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు..

కరీంనగర్, నవంబర్ 9: కరీంనగర్ నగర అభివృద్ధికి కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నగరంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రాంనగర్ డివిజన్‌లో రూ.1.5 కోట్లతో చేపట్టనున్న బాక్స్ టైప్ నిర్మాణ పనులను ప్రారంభించారు.



అనంతరం మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.17 కోట్లు, యూనీఎఫ్ పథకం కింద మరో రూ.80 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అమృత్ పనులకు టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు కొందరు లేని వివాదాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని గల్లీల్లో ఏడాదిలోపు అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి..

ఇందిరమ్మ కాలనీ వద్ద మృతదేహం గుర్తింపు

ఖమ్మం, నవంబర్ 9: ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. సాయిబాబా గుడి సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని వైరాకు చెందిన ఏలూరు ప్రభాకర్‌రావుగా గుర్తించారు.

ప్రస్తుతం ఆయన పల్లిపాడులో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇందిరమ్మ కాలనీ వద్ద మృతదేహాన్నిగుర్తించారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నప్పటికీ, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల

లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ సంబరాలు

నల్గొండ, నవంబర్ 9: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పట్టుబట్టలు, స్వీట్లు, టపాకాయలు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి నూతన గృహంలోకి అడుగుపెట్టి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు.

జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ నౌక 'అమిని' భారత నౌకాదళానికి అందజేత

న్యూ ఢిల్లీ, నవంబర్ 9:కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్, ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించిన జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ కార్యకలాపాల కోసం ఉద్దేశించిన షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యూ ఎస్‌డబ్ల్యూసీ) నౌకల్లో ఒకటైన 'అమిని' ని 2026 నవంబర్ 5న భారత నౌకాదళానికి అందజేశారు. కోల్‌కతాలోని జీఆర్ఎస్ఈ సంస్థ నిర్మించిన ఈ యుద్ధ నౌకలను ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్) వర్గీకరణ నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, నిర్మించారు. వాటర్‌జెట్ ప్రొపల్షన్ వ్యవస్థ తో నడిచే ఈ నౌకలు.. భారత నౌకాదళానికి చెందిన అతిపెద్ద యుద్ధనౌకల్లో ఒకటి. అత్యాధునిక తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, సోనార్లతో వీటిని రూపొందించారు. ఇవి నముద్రగర్భంలోని ముప్పులను సమర్థంగా గుర్తించి, ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ నౌక భారత నౌకాదళ జలాంతర్గామి వ్యతిరేక కార్యకలాపాలు, తీర ప్రాంత నిఘా, సముద్రంలో మందుపాతరలు అమర్చే సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది. 'అమిని' అనే పేరు కేంద్ర పాలిత ప్రాంతం లక్షద్వీప్‌లోని అమిని ద్వీపం నుంచి తీసుకున్నారు. గతంలో 2002లో సేవల నుంచి విరమించిన పెట్యా-ఎఎ తరగతికి చెందిన జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ నౌక ఐఎన్ఎస్ అమిని పేరును కొనసాగిస్తూ ఈ నౌకకు అదే పేరు పెట్టారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగం..

నల్గొండ, నవంబర్ 9:పదవీ విరమణ పొందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి విధుల్లో ఉండగానే మరణించినట్లు నకిలీ రికార్డులు సృష్టించి.. ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించిన అక్రమాన్ని నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కుట్రలో ప్రత్యక్షంగా భాగస్వాములైన కుటుంబ సభ్యులు, బంధువులు, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సహా మొత్తం 14 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

పదవీ విరమణ తర్వాత మరణం.. విధుల్లో ఉండగానే చనిపోయినట్లు రికార్డులు

శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన చామకూరి వెంకటేశ్వర్లు 2025 మే 31న పదవీ విరమణ పొందారు. అనంతరం కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ అదే ఏడాది నవంబర్ 17న మరణించారు. అయితే ఆయన పదవీ విరమణ పొందిన తర్వాత చనిపోయిన విషయాన్ని దాచిపెట్టి, విధుల్లో ఉండగానే మరణించినట్లు చూపిస్తే కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని కొందరు బంధువులు, సహోద్యోగులు పథకం రచించినట్లు ఎస్పీ తెలిపారు.

వెంకటేశ్వర్లు దశదిన కర్మలకు హాజరైన సమయంలో ఈ కుట్రకు రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. మృతుడి భార్య చామకూరి వసంత.. నల్లగొండ డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందితో కలిసి నకిలీ రికార్డులు సృష్టించేందుకు రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఆధార్ చిరునామా మార్పుతో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం

పథకంలో భాగంగా మీసేవా కేంద్రం ద్వారా వెంకటేశ్వర్లు ఆధార్ కార్డులోని అనలు చిరునామాను మార్చి, నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యపురి కాలనీలో నివసిస్తున్నట్లు తప్పుడు వివరాలు నమోదు చేశారు. ఈ మార్పు ఆధారంగా ఆయన 2025 మే 28న, అంటే పదవీ విరమణకు మూడు రోజుల ముందే విధుల్లో ఉండగా మరణించినట్లు నల్లగొండ మున్సిపాలిటీ నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందారు.

ఈ నకిలీ పత్రాలతో పాటు తప్పుడు విచారణ నివేదికలను ఉపయోగించి మృతుడి కుమారుడు చామకూరి రాజుకు దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించినట్లు ఎస్పీ వివరించారు.

అరెస్టయిన వారిలో కుటుంబ సభ్యులు, అధికారులు..

ఈ కేసులో మృతుడి భార్య చామకూరి వసంత, ఉద్యోగం పొందిన కుమారుడు చామకూరి రాజు (21), రాచకొండ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్‌గౌడ్ (ఒగోడు), కట్లా సతీష్ (12వ బెటాలియన్ టీజీఎస్పీ, అన్నెపర్తిలో కంప్యూటర్ ఆపరేటర్) అరెస్టయ్యారు. సాక్షిగా సంతకం చేసిన బంధువుగా కట్లా సతీష్ పాత్రను పోలీసులు గుర్తించారు.

వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డాక్టర్ ఆకుల కృష్ణ సూర్య శిల్ప (మెడికల్ ఆఫీసర్, శాలిగౌరారం పీహెచ్‌సీ), కంచర్ల జగన్నాథరెడ్డి (సీనియర్ అసిస్టెంట్, శాలిగౌరారం పీహెచ్‌సీ), పోలే రంజిత్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్ కమ్ డీఎంహెచ్‌వో సీసీ), నాగిరెడ్డి జితేందర్‌రెడ్డి (ఆఫీస్ సూపరింటెండెంట్), మహబూబ్ అలీ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), గింకల రాకేష్ యాదవ్ (సీనియర్ అసిస్టెంట్), తుంగతుర్తి మోహన్‌కృష్ణ (జూనియర్ అసిస్టెంట్)లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

మరోవైపు గుండ్లవల్లికి చెందిన మీ సేవా కేంద్రం నిర్వాహకుడు పనస చంద్రశేఖర్ అలియాస్ చందు, నల్లగొండ వార్డు ఆఫీసర్ ముక్కముయిల శివ జనార్ధన్, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రదీప్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

మరో ఇద్దరు కీలక నిందితులు పరారీ..

ఈ అక్రమంలో కీలక పాత్ర పోషించిన కలెక్టరేట్ ఏవో చామకూరి రాజశేఖర్, కేతేపల్లి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ చామకూరి రవీందర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రూ.5 లక్షల నగదు, కంప్యూటర్ స్వాధీనం

అరెస్టయిన నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, కంప్యూటర్, ప్రింటర్, 12 సెల్‌ఫోన్లు, మృతుడు చామకూరి వెంకటేశ్వర్లు ఫొటోలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవంబర్ 4న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

నల్లగొండ డీఎస్పీ కె. శివరామిరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ కె. ఆదిరెడ్డి, నల్లగొండ రూరల్ ఎస్ఐ బి. శివప్రసాద్, టూటౌన్ ఎస్ఐ డి. సైదాబాబు, వన్‌టౌన్ ఎస్ఐలు ఎన్. వెంకట్ నారాయణ, జె. సైదులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ వ్యవస్థలను మభ్యపెట్టి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు.

సెమికాన్ 2.0 వెబ్ అప్లికేషన్ వేదికను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్.. ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం కింద 12 మంది ఆమోదిత దరఖాస్తుదారుల ప్రకటన

న్యూ ఢిల్లీ, నవంబర్ 9:భారత్ సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర రైల్వే, దేశీయ విలువ ఆధారిత సరఫరా వ్యవస్థ సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ నేడు సెమికాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 2, 3, 4వ కీలక విభాగాల కోసం రూపొందించిన 'సెమికాన్ 2.0-వెబ్ అప్లికేషన్ వేదికను ప్రారంభించారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద ఆమోదం పొందిన 12 మంది దరఖాస్తుదారుల వివరాలను పరిశ్రమలకు ప్రకటించారు.

దేశంలో పటిష్ఠమైన, నమ్మకమైన సెమికండక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ వ్యూహాత్మక కార్యక్రమాలు, విధానపరమైన చర్యల ద్వారా సమన్వయంతో కూడిన కృషి చేస్తోంది.

ఏర్పాటైన కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే ఇండియా సెమికండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) దేశ సెమికండక్టర్ రంగం అభివృద్ధికి ఊతమిచ్చింది. సెమికాన్ ఇండియా కార్యక్రమం తొలి దశ (సెమికాన్ 1.0) విజయవంతంగా అమలైంది. ఈ దశలో ఆరు రాష్ట్రాల్లో మొత్తం రూ.1.64 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో 12 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ 12 ప్రాజెక్టుల్లో అయిదు ఇప్పటికే 2026 అక్టోబర్ నాటికి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి.

ఇదే సమయంలో 105 అంకుర సంస్థలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) పరికరాలను వినియోగించుకునే అవకాశం కల్పించారు. 24 అంకురాలకు నిధుల ద్వారా మద్దతు అందించగా, 15 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ నిధులను పొందాయి. 'చిప్స్ టు స్టార్టప్' (సీ2ఎస్) కార్యక్రమం కింద 332 విద్యాసంస్థలకు ఈడీఏ పరికరాలను అందించారు. ఇప్పటివరకు సుమారు 70,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

భారత్ సెమికండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద రూ.1,27,500 కోట్ల ఆర్థిక కేటాయింపులతో సెమికాన్ 2.0 కార్యక్రమానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భారత్ సెమికండక్టర్ ప్రయాణంలో తదుపరి దశగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆరు వ్యూహాత్మక విషయాలపై దృష్టి సారించింది.

కేంద్ర మంత్రివర్గం ఇండియా సెమికండక్టర్ మిషన్ (మోఓ) కింద ?1,27,500 కోట్ల ఆర్థిక కేటాయింపుతో సెమికాన్ 2.0కు ఆమోదం తెలిపింది. భారతదేశ సెమికండక్టర్ ప్రయాణంలో తదుపరి దశకు నాంది పలుకుతూ, సెమికాన్ 2.0 ఆరు వ్యూహాత్మక స్తంభాలపై దృష్టి సారించింది:

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక, రైల్వే, సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం కేవలం అసెంబ్లీ దశను దాటి, మాడ్యూళ్లు, విడిభాగాలు, ముడి పదార్థాలు, అధునాతన సాంకేతికతలతో కూడిన సమగ్ర తయారీ రంగం కేవలం అసెంబ్లీ దశను దాటి, మాడ్యూళ్లు, విడిభాగాలు, ముడి పదార్థాలు, అధునాతన సాంకేతికతలతో కూడిన సమగ్ర ముందడుగు పడింది. కేంద్ర రైల్వే, దేశీయ విలువ ఆధారిత సరఫరా వ్యవస్థ సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ తెలిపారు. బ్యాటరీ సెల్స్, కాపర్ ఫాయిల్స్, కాపర్ క్లాడ్ లామినేట్స్, అధిక సామర్థ్యం కలిగిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీలో దేశీయ సామర్థ్యాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు దేశీయ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ పథకం కింద ఆమోదం పొందిన యూనిట్లలో దాదాపు 50 శాతం ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవేనని వివరించారు. సెమికాన్ ఇండియా 2.0లో పరికరాలు, ముడి పదార్థాలు, రసాయనాలు, వాయువులకు సంబంధించిన రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ పటిష్ఠమైన సెమికండక్టర్ వ్యవస్థను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. కనీసం మూడు ప్రధాన పరికరాల తయారీ సంస్థలను, అయిదు రసాయనాలు, వాయువుల తయారీ సంస్థలను భారత్‌కు ఆకర్షించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల ఎంపికలో కఠినమైన ప్రమాణాలను పాటించాలని ఆయన సూచించారు. నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంలో లోతైన నైపుణ్యం, పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), ప్రపంచ మార్కెట్‌లో పోటీపడే సామర్థ్యం దేశ సెమికండక్టర్ రంగ లక్ష్యాలకు మార్గదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ లక్ష్యాలు ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. భారత్‌ను ప్రపంచస్థాయి పోటీతత్వం కలిగిన ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పరిశ్రమల భాగస్వాములు పరస్పరం సహకరించుకోవాలని, తమ నైపుణ్యాన్ని పంచుకోవాలని, నిరంతర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గతంలో ప్రకటించిన రూ. 69,548 కోట్ల పెట్టుబడులతో కూడిన 106 దరఖాస్తులకు ఆమోదం కొనసాగింపుగా.. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద తాజాగా మరో 12 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. ఈ దరఖాస్తుల ద్వారా రూ.7,503 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా.

ఈ ప్రాజెక్టులు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ సహా మొత్తం ఏడు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. దీంతో దేశంలో ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ రంగం భౌగోళిక పరిధి మరింత విస్తరించనుంది.

ఈ తాజా ఆమోదాల్లో భాగంగా కాపర్ ఫాయిల్, క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, ప్రత్యేక సిరామిక్ ఉత్పత్తుల తయారీకి ఈసీఎంఎస్ కింద తొలిసారిగా ఆమోదం లభించింది. దీంతో దేశీయంగా తయారయ్యే ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, వాటి తయారీకి అవసరమైన ప్రాథమిక ముడి పదార్థాల పరిధి మరింత విస్తరించనుంది.

అంతేకాకుండా, మూలధన వస్తువులు, వాటి విడిభాగాల దేశీయ తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపైనా తాజా ఆమోదాల్లో ప్రాధాన్యత కొనసాగింది. ఇందులో భాగంగా ప్రెసిషన్ మోల్డ్స్, టూలింగ్ తయారీకి టీడీకనెక్స్ (చెన్నై) ప్రైవేటు లిమిటెడ్‌కు, మూలధన పరికరాలకు అవసరమైన పవర్, కంట్రోల్ సిస్టవ్స్ తయారీకి రాక్‌వెల్ ఆటోమేషన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు, ఫ్యాక్టరీ ఆటోమేషన్, సిస్టమ్ ఇంటిగ్రేషన్‌కు అవసరమైన మూలధన పరికరాల తయారీకి విప్రో పారి రోబోటిక్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు ఆమోదం లభించింది.

ఈ తాజా ఆమోదాలతో కలిపి ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో 34 ఉత్పత్తులకు సంబంధించి మొత్తం 118 దరఖాస్తులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.77,051 కోట్ల పెట్టుబడులు వస్తాయని, రూ.5,73,146 కోట్ల విలువైన ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యక్షంగా 81,755 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ఈ ఆమోదాలు దేశీయ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు, ఉత్పత్తుల్లో దేశీయ విలువ జోడింపును పెంచుతాయి. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, అధునాతన తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తాయి. తద్వారా ప్రపంచస్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా భారత్ ఎదిగేందుకు మరింత దోహదపడతాయి.

మీడియాతో కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. "గత దశాబ్ద కాలంలో భారత్‌లో మౌలికమైన మార్పు చోటుచేసుకుంది. అయితే, ఇది కేవలం ఆరంభం మాత్రమే. వివిధ విధానపరమైన కార్యక్రమాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సమన్వయంతో చేస్తున్న కృషి సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు పునాది వేస్తున్నాయి" అని అన్నారు. దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను భారత్ మరింత బలోపేతం చేస్తోందని, దేశంలోనే కంప్యూటర్లు, వాటి విడిభాగాల తయారీపై దృష్టి పెరుగుతోందని తెలిపారు. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పటిష్ఠమైన, స్వావలంబనతో కూడిన ఎలక్ట్రానిక్స్ విలువ ఆధారిత సరఫరా వ్యవస్థను నిర్మించవచ్చని ఆయన పేర్కొన్నారు.

సెమికాన్ 2.0 వెబ్ అప్లికేషన్ వేదిక ప్రారంభం, ఈసీఎంఎస్ కింద ఆమోదం పొందిన దరఖాస్తుదారుల వివరాల ప్రకటన భారత్ సెమికండక్టర్ రూపకల్పన, తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలక ముందడుగుగా నిలిచాయి.

100శాతం స్ట్రైక్ రేట్ సాధించటం అభినందనీయం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అమరావతి, నవంబర్ 9: ఘంటసాల మండలంలో 100శాతం స్ట్రైక్ రేట్ సాధించటం అభినందనీయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘంటసాల మండలంలో కూటమి బలపరిచిన టీడీపీ, జనసేన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ప్రతి ఒక్కరూ విజయం సాధించి 100శాతం స్ట్రైక్ రేటుతో మండలం మొత్తం క్లీన్ స్వీప్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో మండల కూటమి నాయకులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ లను కూటమి నాయకులు సత్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, కోన రాజశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, డీసీ వైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, తెలుగు యువత కార్యదర్శి తాడికొండ వేంకటేశ్వరరావు (చిన్నా), డీసీ వైస్ చైర్మన్ పరిసే చలపతిరావు, మాజీ సర్పంచులు ముప్పనేని రవికుమార్, గాజుల శ్రీనివాసరావు, టీడీపీ నేత యార్లగడ్డ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అవయవాలు అమ్మి డబ్బు సంపాదించేందుకు.. బాలుడిని చంపిన బంధువు

న్యూ ఢిల్లీ, నవంబర్ 9:మనిషి అవయవాలు అమ్మి త్వరగా డబ్బు సంపాదించాలని ఒక వ్యక్తి భావించాడు. నాలుగేళ్ల బాలుడిని అతడు హత్య చేశాడు. శరీరం నుంచి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్లను తొలగించాడు. ఈ అవయవాలను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించాడు. ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. 36 ఏళ్ల రామ్‌జీత్ రామ్, ఏడాది కిందట ఉపాధి కోసం సన్నా గ్రామానికి వచ్చాడు. నది నకట్ట సమీపంలోని ఒక గుడిసెలో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. బంధువైన వాసుదేవ్ తరచుగా వారి ఇంటిని సందర్శించేవాడు.

కాగా, రామ్‌జీత్ నాలుగేళ్ల కుమారుడు నవంబర్ 5 నుంచి కనిపించలేదు. కుటుంబ సభ్యులు వెతుకగా రెండు రోజుల తర్వాత మహువా గ్రామంలోని ఒక పొలం వద్ద గుంతలో పడేసిన సంచిలో కుక్కి ఉన్న బాలుడి మృతదేహం కనిపించింది. ఈ సమాచారం తెలుసుకున్న సన్నా పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పరిశీలించగా మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్లు వంటి అవయవాలు మాయమైనట్లు తెలుసుకుని షాక్ అయ్యారు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు బాలుడి హత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సమీపంలోని చల్ని గొర్రాపథ్ గ్రామానికి చెందిన బంధువైన వాసుదేవ్‌పై అనుమానించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించాడని పోలీస్ అధికారి తెలిపారు. రోజువారీ కూలీ పని ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో మరింత డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు వివరించారు.

అయితే త్వరగా డబ్బు సంపాదించే మార్గాల కోసం నిందితుడు వాసుదేవ్ తరచుగా సోషల్ మీడియాలో వెతికేవాడని పోలీస్ అధికారి తెలిపారు.

ఆ క్రమంలోనే చిన్న పిల్లల అవయవాలను తొలగించి విక్రయించాలనే ఆలోచన అతడికి కలిగిం దని చెప్పారు. నవంబర్ 5న నిందితుడు బాలుడిని నమ్మించి తనతో పాటు పలు ప్రాంతాలకు తీసుకెళ్లాడని పోలీస్ అధికారి తెలిపారు. మద్యం, చికెన్ కొనుగోలు చేసిన అతడు బాలుడికి మద్యం తాగించినట్లు చెప్పారు.

ఆ బాలుడు మత్తులోకి జారుకుని నిద్రపోయిన తర్వాత, నిందితుడు కత్తితో గొంతు కోసి హత్య చేశాడని, ఆపై బాలుడి శరీరాన్ని కోసి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్లను తొలగించి వాటిని ఒక ప్లాస్టిక్ బకెట్‌లో భద్రపరిచినట్లు పోలీస్ అధికారి వివరించారు.

బాలుడి మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి సంచిలో కుక్కి పొలంలోని నీటి గుంతలో పడేసి దానిపై మట్టి కప్పాడని వెల్లడించారు.

నిందితుడు వానుదేవ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నేరానికి ఉపయోగించిన ఆయుధాలు, అవయవాలు ఉన్న ప్లాస్టిక్ బకెట్, ఇతర వస్తువులను ఒక గుంత నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు

. నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైన మహమ్మద్ అఫ్వాన్

అభినందించిన మంత్రి వాకిటి శ్రీహరి



మహబూబ్‌నగర్, నవంబర్ 9: నారాయణపేట జిల్లా ఊట్కూర్ పట్టణానికి చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి మహమ్మద్ అఫ్వాన్ జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య, క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నన్నామించి, అభినందించారు. మహమ్మద్ అఫ్వాన్ నారాయణపేటలోని క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, తన పట్టుదల, కృషి, అద్భుతమైన ఆటతీరుతో ఈ ఘనత సాధించాడు. స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు అఫ్వాన్ ఎంపికయ్యాడు.

ఈ సందర్భంగా మహమ్మద్ అఫ్వాన్ తల్లిదండ్రులు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి తమ కుమారుడికి జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి శ్రీహరి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సాధించిన ఈ విజయంపై తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అఫ్వాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నారాయణపేట జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు అమర్ రెడ్డి సమీవుల్లా కల్వాల్, ఏఎంసీ డైరెక్టర్ ఫయాజ్ ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి గారు మహమ్మద్ అఫ్వాన్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జూదం స్థావరాలపై దాడులు.. 13 మంది అరెస్ట్



నిజామాబాద్, నవంబర్ 9:సదాశివనగర్ మండల పరిధిలో జూదం ఆడుతున్న వారిపై తనప్రకాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆదివారం రాత్రి పోలీసులు మండలంలోని వివిధ గ్రామాల శివారుల్లో మెరుపు దాడులు నిర్వహించినట్లు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ పేర్కొన్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు బొంపల్లి, పద్మాజీవాడి, మల్లుపేట్ గ్రామాల శివారుల్లో నిర్వహించిన దాడుల్లో జూదం ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిపై మూడు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో నగదు, మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కడెంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు!

పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా: భూక్యా జాన్సన్ నాయక్

ఈ నెల 11న కేటీఆర్ రైతు గర్జన సభను విజయవంతం చేయాలి



ఆదిలాబాద్, నవంబర్ 9: నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలంలో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. సోమవారం కొండుకూర్‌లోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.

వారికి ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. కేసీఆర్ పాలనలో అమలైన రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు రైతులకు భరోసా కల్పించాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఈ నెల 11న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న రైతు గర్జన సభను విజయవంతం చేయాలని నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

నల్గొండ, నవంబర్ 9::మిర్యాలగూడ మండల పరిధిలోని తక్కెళ్లపాడు తండాకు చెందిన భూక్య సుజాత నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆదివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.



హైదరాబాద్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియోను ప్రారంభించనున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 9: హైదరాబాద్‌లోని బండ్లగూడ-నాగోల్‌లో ఉన్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో మూడు ప్రధాన వసతులైన అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియోను 2026 నవంబర్ 10న ఉదయం 09:30 గంటలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు.

జీఎస్ఐటీఐ శిక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ శిక్షణ, అధునాతన జియో సైంటిఫిక్ పరిశోధన, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను పెంపొందించడంలో సాధించిన విజయాన్ని ఈ ప్రారంభోత్సవం సూచిస్తుంది.

అంతర్జాతీయ హాస్టల్ ప్రారంభోత్సవంతో ఈ కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీని, డిజిటల్ స్టూడియోను ప్రారంభిస్తారు. డైరెక్టర్ జనరల్ శ్రీ దినేష్ వి. గన్వీర్ స్వాగతోపన్యాసం చేస్తారు. అనంతరం మల్కాజిగిరి లోక్‌సభ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తారు.

గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ఫరీదా ఎం. నాయక్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

అంతర్జాతీయ వసతి గృహం (నలంద, తక్షశిల): జీఎస్ఐ అందించిన రూ. 4.27 కోట్ల నిధులతో దీనిని ఏర్పాటు చేశారు. దీనిలో భోజనశాల, రిక్రియేషన్ వసతులు, వ్యాయామశాల, మినీ-లైబ్రరీ, లాండ్రీ లాంటి ఆధునిక సదుపాయాలతో పాటు పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఏర్పాటు చేసిన 32 సూట్లు ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సూచనల ప్రకారం దీనిని అభివృద్ధి చేశారు. ఇది అంతర్జాతీయ శిక్షణార్థులకు సౌకర్యవంతమైన బసను కల్పించడంతో పాటు వృత్తిపరమైన సంబంధాలను, సాంస్కృతిక వినిమయాన్ని, అంతర్జాతీయ సహకారాలను పెంపొందించడానికి తోడ్పడుతుంది.

అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబరేటరీ: ఎన్ఎంఈటీ, జీఎస్ఐ సమకూర్చిన రూ. 4.55 కోట్ల నిధులతో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీనిలో 25 అత్యాధునిక కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్‌వేర్ ఉన్నాయి. వీటిని ఖనిజాన్వేషణలో సామర్థ్యాన్ని బలోపేతం చేసేలా అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్, మోడలింగ్, ఇన్వర్షన్, సమాచార విశ్లేషణకు ఉపయోగిస్తారు.డిజిటల్ స్టూడియో: సీబీసీ, జీఎస్ఐ అందించిన రూ.30 లక్షల వ్యయంతో ఈ స్టూడియోను ఏర్పాటు చేశారు. మిషన్ కర్మయోగికి అనుగుణంగా ఐజీవోటీ కర్మయోగి పోర్టల్ కోసం వీడియో పాఠాలు, పాడ్‌క్యాస్ట్‌లు, వెబినార్లతో సహా నాణ్యమైన డిజిటల్ లెర్నింగ్ వనరులను రూపొందించడానికి ఈ స్టూడియో వీలు కల్పిస్తుంది.ఈ సౌకర్యాలు జీఎస్ఐటీఐ శిక్షణ మౌలికవసతులను, అంతర్జాతీయ సహకారాన్ని, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను బలోపేతం చేస్తాయి.

రైల్వేల కోసం బొగ్గు నిక్షేపాలను అన్వేషించడానికి 1851లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)ను స్థాపించారు. ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖ భూ విజ్ఞాన సంస్థగా ఎదిగింది. జియోలాజికల్ సర్వేలు, అన్వేషణ, వివిధ విభాగాల అధ్యయనాలు, ప్రకృతి విపత్తులపై పరిశోధనలు, ప్రాథమిక భౌగోళిక శాస్త్రాల ద్వారా జాతీయ భూవిజ్ఞాన సమాచారాన్ని సిద్ధం చేయడం, నవీకరించడం, ఖనిజ వనరులను అంచనా వేయడం ఈ సంస్థ ప్రధాన విధులు.

శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాలు నవంబర్ 8న బొమ్డిలాలోని తుబ్‌చోగ్ గట్సెల్ లింగ్ మఠానికి చేరుకున్నాయి



న్యూ ఢిల్లీ, నవంబర్ 9:శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాలు 8 నవంబర్ 2026న అరుణాచల్ ప్రదేశ్‌లోని బొమ్డిలాలో ఉన్న తుబ్‌చోగ్ గట్సెల్ లింగ్ మఠానికి (దిగువ గోంపా) చేరుకున్నాయి మరియు ప్రజల దర్శనం కోసం మఠంలో ప్రతిష్ఠించబడ్డాయి. పవిత్ర అవశేషాలు 2026 నవంబర్ 8 నుండి 13 వరకు ప్రజల దర్శనానికి అందుబాటులో ఉంటాయి. ఈ ప్రదర్శనను భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం మరియు న్యూఢిల్లీలోని అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య సహకారంతో నిర్వహిస్తోంది.

నవంబర్ 8న జరిగిన బహిరంగ ప్రదర్శన మొదటి రోజుకు ప్రోత్సాహకరమైన స్పందన లభించింది. సుమారు 4,000 మంది భక్తులు పవిత్ర అవశేషాల దర్శనం కోసం మఠాన్ని సందర్శించారు.

బౌద్ధ సన్యాసులు, ప్రముఖులు, వయోవృద్ధులు మరియు దివ్యాంగులు కూడా ప్రార్థనలు చేసి, తమ గౌరవాన్ని తెలియజేశారు.

2026 నవంబర్ 9 నుండి 13 వరకు, బొమ్డిలా నియోజకవర్గం మరియు పొరుగు నియోజకవర్గాల నుండి భక్తులు ప్రార్థనలు చేయడానికి మరియు ఆశీర్వాదం పొందడానికి మఠాన్ని సందర్శించనున్నారు.

పవిత్ర అవశేషాలను తవాంగ్ నుండి బొమ్డిలాకు భారత వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్‌లో తరలించారు.

ఈ యాత్రలో ఐబిసి డిప్యూటీ సెక్రటరీ జనరల్ శ్రీ భిక్కు ఖేమచారా, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం మరియు ఐబిసి అధికారులు పాల్గొన్నారు. రూపాలోని ఆర్మీ హెలిప్యాడ్ వద్ద, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ విద్యా, పర్యాటక, గ్రామీణ పనుల శాఖ మరియు పబ్లిక్ లైబ్రరీల శాఖల మంత్రి శ్రీ పసాంగ్ దోర్జీ సోనా గారు తగిన లాంఛనాలతో పవిత్ర అవశేషాలను స్వీకరించారు. హెలిప్యాడ్ వద్ద గౌరవ వందనం సమర్పించారు. అనంతరం, పవిత్ర అవశేషాలు బొమ్డిలా వైపు పయనమయ్యాయి. మార్గమధ్యంలో అప్పర్ గోంపా వద్ద కొద్దిసేపు లాంఛనప్రాయంగా ఆగి, ప్రతిష్ఠాపన కోసం థుబ్‌చోగ్ గట్సెల్ లింగ్ మఠానికి (లోయర్ గోంపా) తీసుకువెళ్లారు.



గోవర్ధన్ గుట్టపై ఆదివాసుల సాంప్రదాయ పూజలు

ఆదిలాబాద్, నవంబర్ 9: దీపావళి పండుగ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ గాదిగూడ మండలాల పరిధిలోని ఆదివాసులు గ్రామ పొలిమేర గోవర్ధన గుట్టకు వాయిద్యాల మధ్య నైవేద్యంతో వెళ్లి గోమాతకు పూజలు నిర్వహించారు. గోవులకు నైవేద్యాన్ని తినిపించారు. గుస్సాడీలకు, పశు కాపరులకు అలింగం చేస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానిస్తూ కానుకలు అందించారు.

టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోడసం రేణుక, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్, మాజీ ఎంపీపీ మెస్రం రూప్ దేవ్ పటేల్,మెస్రం మోతిరాం పటేల్, కోట్నాక్ నానాజీ, మెస్రం చందు,నాగోరావ్, భీంరావ్, బాధిరావ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చాగల్లు అభివృద్ధికి కడియం శ్రీహరి భరోసా!

వారం రోజుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రారంభం

9వ వార్డులో ఎస్సీ మహిళలకు కమ్యూనిటీ హాల్ మంజూరు

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూల హామీ

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఎంపీ కడియం కావ్యకు విజ్ఞప్తి

వరంగల్, నవంబర్ 9: స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారంతో పాటు 9వ వార్డులో ఎస్సీ మహిళలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. ఈ మేరకు హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని 9వ వార్డు కౌన్సిలర్, విప్ సోదరపల్లి సంపత్‌రాజు, 7వ వార్డు కౌన్సిలర్ అన్నెపు సుమలత కుమార్ గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చాగల్లు గ్రామంలోని 9వ వార్డులో ఎస్సీ మహిళలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, గ్రామంలో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఎస్సీ మహిళలకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయ పనులు లేక గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు అధ్యక్షుడు భాస్కుల నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలపాక శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు భాస్కుల అనిల్, జాబు గణేష్ తదితరులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల తొలగింపు ఆలోచన విరమించుకోవాలి!

నర్సంపేట డిపో మేనేజర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా.. ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

వరంగల్, నవంబర్ 9: బస్టాండ్ ఆవరణలోని మహనీయుల విగ్రహాల తొలగింపు ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, స్వేరో సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బస్టాండ్ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించాలన్న నర్సంపేట డిపో మేనేజర్ వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలు సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యానికి ప్రతీకలని పేర్కొన్నారు.విగ్రహాల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతోపాటు, దళిత సామాజిక వర్గానికి డిపో మేనేజర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఇతర ప్రజాసంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి భారత్-మయన్మార్ ద్వైపాక్షిక త్రివిధ దళాల మానవతా సహాయ మరియు విపత్తు ఉపశమన విన్యాసం



న్యూ ఢిల్లీ, నవంబర్ 9:భారత, మయన్మార్ రక్షణ దళాల మధ్య 05, 06 నవంబర్ 2026 తేదీలలో నిర్వహించిన తొలి ద్వైపాక్షిక త్రివిధ దళాల మానవతా సహాయ మరియు విపత్తు ఉపశమన విన్యాసం 'రాహత్ మిత్ర' చెన్నైలో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ విన్యాసంలో, కార్యాచరణ పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి, సమన్వయాన్ని మెరుగుపరచడానికి మరియు విపత్తు ప్రతిస్పందన కార్యకలాపాలలో ఉత్తమ పద్ధతుల మార్పిడిని సులభతరం చేయడానికి, భారత నౌకాదళం, భారత సైన్యం మరియు భారత వైమానిక దళ సిబ్బందితో పాటు మయన్మార్ రక్షణ దళాల ప్రతినిధి బృందం కూడా పాల్గొంది.

ఉమ్మడి ప్రణాళిక మరియు హెచ్‌డిఏఆర్ సామర్థ్యాలపై అవగాహనతో ఈ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తీవ్రమైన తుఫాను దృష్టాంతం ఆధారంగా నిర్వహించిన టేబుల్-టాప్ ఎక్సర్‌సైజ్ సమన్వయ ప్రతిస్పందన యంత్రాంగాలు మరియు ఉమ్మడి విపత్తు నిర్వహణ ప్రోటోకాల్స్‌పై చర్చలకు వీలు కల్పించింది. పాల్గొన్న బృందాలు భారత సైన్యం యొక్క అడ్డంకుల తొలగింపు మరియు వంతెన నిర్మాణ సామర్థ్యాల ప్రదర్శనలను వీక్షించాయి. అలాగే, భారత నౌకాదళం యొక్క నౌకా ఆధారిత ఊంఖీ సామర్థ్యాలపై అవగాహన పొందడానికి ఐఎన్ఎస్ సుకన్యను సందర్శించాయి. రెండవ రోజున, పాల్గొన్న బృందాలు భారత రక్షణ దళాల యొక్క బహుళ-రంగ ఊంఖీ సామర్థ్యాల ప్రదర్శనలను వీక్షించాయి. ఈ ప్రదర్శనలు సముద్ర, భూ మరియు వాయు రంగాలలో సమన్వయ ప్రతిస్పందన యంత్రాంగాలను హైలైట్ చేశాయి. ఐఎన్ఎస్ అడయార్ మరియు కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సెంటర్, చెన్నై, తీర ఆధారిత విపత్తు ప్రతిస్పందన ఏర్పాట్లను మరియు అత్యవసర పరిస్థితులలో కమాండ్ అండ్ కంట్రోల్‌కు మద్దతు ఇచ్చే కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను ప్రదర్శించాయి. మిలిటరీ హాస్పిటల్, చెన్నై, క్షేత్రస్థాయి వైద్య ట్రైయేజ్ మరియు విపత్తు సహాయక శిబిరాల సమన్వయ నిర్వహణను ప్రదర్శించింది.

భారత నౌకాదళానికి చెందిన వరద సహాయక బృందాలు వరద సహాయక చర్యల కోసం ప్రత్యేక పరికరాలు మరియు సామర్థ్యాలను ప్రదర్శించాయి. చేతక్ హెలికాప్టర్ మరియు ఐఎన్ఎస్ బిత్రాతో కూడిన సమన్వయ విన్యాసాల ద్వారా సముద్ర శోధన మరియు రక్షణ సామర్థ్యాలను కూడా ప్రదర్శించారు. వైమానిక కార్యకలాపాల సమయంలో కమోడోర్ ఆంగ్ నియాంగ్ విన్ మరియు మయన్మార్ ప్రతినిధి బృందానికి చెందిన ఇద్దరు అధికారులు ఐఏఎఫ్ ఏఎల్‌హెచ్‌లో ఉండగా, భారత వైమానిక దళం క్షతగాత్రుల తరలింపు సామర్థ్యాలను ప్రదర్శించింది.

'రాహత్ మిత్ర' విన్యాసాలు ఇరు దేశాల రక్షణ దళాలకు కార్యాచరణ అనుభవాలను పంచుకోవడానికి, ఉత్తమ పద్ధతులను పాటించడానికి మరియు మానవ, విపత్తు సహాయ కార్యకలాపాల ప్రణాళిక, అమలులో పరస్పర అవగాహనను పెంపొందించుకోవడానికి ఒక ముఖ్యమైన వేదికను అందించాయి. ఈ విన్యాసాలు ఒకరి సామర్థ్యాలు, విధానాలను మరొకరు తెలుసుకోవడానికి కూడా దోహదపడి, విపత్తు ప్రతిస్పందన కార్యకలాపాల సమయంలో మెరుగైన సమన్వయానికి దోహదం చేశాయి.ఈ తొలి విన్యాసాల విజయవంతమైన ముగింపు, ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని పెంపొందించడానికి మరియు విపత్తు ప్రతిస్పందన కోసం సామూహిక నంసిద్ధతను పెంచడానికి భారతదేశం మరియు మయన్మార్‌ల నిబద్ధతను బలపరుస్తుంది. ఇది ప్రాంతీయ స్థిరత్వం, సముద్ర సహకారం మరియు సమర్థవంతమైన హెచ్‌డిఏఆంకు దోహదపడాలనే ఇరు దేశాల ఉమ్మడి సంకల్పాన్ని కూడా నొక్కి చెబుతుంది.

అగ్నిప్రమాదం.. ప్రభుత్వమే ఆదుకోవాలి

దీపావళి వేళ పూల వ్యాపారుల జీవితాల్లో చీకట్లు!

అగ్నిప్రమాదంలో మూడు పూల దుకాణాలు పూర్తిగా దగ్ధం..

రెక్కల కష్టంతో కూడబెట్టిన పెట్టుబడి బూడిదపాలు..

రూ.3 నుంచి 4 లక్షల వరకు ఆస్తి నష్టం..

ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న బాధితులు..



వరంగల్, నవంబర్ 9: దీపావళి పండుగ వేళ ఆ కుటుంబాల జీవితాల్లో ఊహించని చీకట్లు అలుముకున్నాయి. ఎన్నో ఏళ్లుగా పూల వ్యాపారమే జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న ముగ్గురు చిరు వ్యాపారుల బతుకులు ఒక్కసారిగా అగ్నికి ఆహుతయ్యాయి. పండుగ వెలుగులు నింపాల్సిన దీపావళి రోజే వారి జీవితాల్లో కన్నీటి చీకట్లు మిగిల్చింది. భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్ చౌక్ సమీపంలో, లోగాల ఫారెస్ట్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారి ఫుట్‌పాత్‌పై తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని కొన్నేళ్లుగా పూల వ్యాపారంతో పాటు దేవుళ్ళ ఫోటోలను అమ్ముకుంటూ, వాచ్ రిపేర్ చేసుకుంటూ ముగ్గురు జీవనం సాగిస్తున్నారు. దీపావళి రోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు వారి దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఈ ప్రమాదంలో పర్ధం బుమయ్య, వీర్నాల జానీ, మల్లికార్జున్‌కు చెందిన మూడు పూల దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. వ్యాపారం కోసం ఎంతో కష్టపడి సమకూర్చుకున్న సామగ్రి, పెట్టుబడి అంతా మంటల్లో బూడిదైంది. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ.2 నుంచి 3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. రోజూ పూలు అమ్మితేనే కుటుంబాలకు పూట గడిచే పరిస్థితి. అలాంటి తమకు ఉన్న ఒక్కటే జీవనాధారం కళ్లముందే కాలిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మళ్లీ వ్యాపారం ప్రారంభించాలంటే పెట్టుబడి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టాన్ని నమ్ముకుని బతుకుతున్న చిరు వ్యాపారులపై విధి పగబట్టినట్లు జరిగిన ఈ ఘటన వారి కుటుంబాలను ఆందోళనలోకి నెట్టింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో స్పందించి నష్టపోయిన తమకు ఆర్థిక సాయం అందించి, తిరిగి వ్యాపారం చేసుకునేలా ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

తెలుగు సాహిత్య సామాజిక చైతన్య రచయిత రావి శాస్త్రి



నవంబర్ 10.. రాచకొండ విశ్వనాధ శాస్త్రి జయంతి

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, మార్పు మరియు ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన గొప్ప రచయిత రావి శాస్త్రి.

రావి శాస్త్రి పూర్తి పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఆయన ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళంలో 1922 జులై 30న జన్మించారు. తండ్రి న్యాయవాది కావడంతో చిన్నప్పటి నుంచే న్యాయశాస్త్రం పట్ల కలిగి ఉన్న ఆసక్తి తరువాత ఆయన రచనా జీవితానికి కూడా దోహద పడింది.

రావి శాస్త్రి ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి తత్వశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. తరువాత మద్రాసు విశ్వ విద్యాలయంలో న్యాయశాస్త్రం చదివి న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అయితే, ఆయనకు సాహిత్యంపై ఉన్న మక్కువతో పాటు, సమాజంలో ఉన్న అన్యాయాలపై, నిర్దయ జీవన శైలిపై తన గొంతును వినిపించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాహిత్యాన్ని ఆయుధంగా ఉపయోగించి, ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారు.

రావి శాస్త్రి రచనలు సామాజిక సమస్యలను, ప్రజల చైతన్యాన్ని, పీడిత వర్గాల బాధలను ప్రతిబింబించాయి. న్యాయవాదిగా వృత్తి

ఎన్నుకున్నా, ప్రజల సమస్యలు, పేదల వేదనలు, అన్యాయం ఎలా ఉన్నాయో సాహిత్యం ద్వారా వెల్లడించాలని ఆయన అనుకున్నారు. రచనలలో ఉత్తరాంధ్ర మాండలికాన్ని సహజమైన శైలిలో ఉపయోగించడం రావి శాస్త్రి సాహిత్యంలో ఒక ప్రత్యేకతగా నిలిచింది.

రావి శాస్త్రి రచనల ప్రధాన లక్ష్యం సమాజంలోని అసమానతలను, అన్యాయాలను ఎండగొట్టడం. ఆయన కథలు ప్రజలలో చైతన్యం కలిగించే శక్తివంతమైన సాధనాలుగా నిలిచాయి.

ఆయన రచనలలో గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, వివిధ వర్గాల ప్రజల అనుభవాలు, జీవిత కష్టాలు, ఆనందాలు ప్రతిఫలిస్తాయి.

ఉత్తరాంధ్ర మాండలికాన్ని తన రచనలలో సహజంగా, అందంగా వాడారు. భాషలో సరళత్వం, సహజత్వం ఉండటంతో పాఠకులకు ఆ రచనలు నేరుగా హృదయానికి తాకుతాయి. రావి శాస్త్రి రచనలలో ప్రజల మధ్య విభజనలు, కుల వివక్షలు, ధనవంతులు-పేదల మధ్య వ్యత్యాసాలు వంటి అంశాలను తీవ్రంగా ప్రస్తావించి, సమాజంలో మార్పు రావాలని కోరుకున్నారు.

రావి శాస్త్రి అనేక ప్రసిద్ధ రచనలు చేసి, తెలుగు సాహిత్యంలో తన కీర్తిని నిలబెట్టుకున్నారు. ఆయన రచనలలో ముఖ్యమైనవి...కథా సాగరం, ఆరు సారా కథలు, రాజు మహిషి, కలకంఠ, బానిస కథలు, ఋక్కులు, గోవులు వస్తున్నాయి జాగ్రత్త, బంగారం మొదలైనవి.

రావి శాస్త్రి రచనలు ప్రజల మనసును కదిలించే శక్తిని కలిగి ఉంటాయి. సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రజల జీవన సవాళ్లను అర్థం చేసుకునేలా ఆయన రచనలు నిలుస్తాయి. ఆయన రచనలు సాహిత్యానికి కొత్త ధోరణులను పరిచయం చేస్తూ, ప్రజలలో సామాజిక చైతన్యాన్ని పెంచేందుకు గొప్ప పాత్ర పోషిస్తాయి.

రావి శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విప్లవాత్మక రచయితగా, సామాజిక మార్పునకు సూచికగా నిలిచారు. ఆయన రచనలు ఇప్పటికీ పాఠకుల హృదయాలలో సజీవంగా ఉన్నాయి. ప్రజల సమస్యలను ఎండగొట్టి, సాంఘిక చైతన్యం కలిగించిన రచయితగా రావి శాస్త్రిని ఎప్పటికీ గౌరవంతో స్మరించుకుంటారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మహిళా సంఘాల ఆత్మగౌరవానికి పక్కా భవనాలు

నవంబర్ 19 నా ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మహిళా సంఘాల ఆత్మగౌరవానికి పక్కా భవనాలను నిర్మాణం చేపడుతున్నామని. నవంబర్ 19 నా ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో త్రివేణి, గాయత్రి మహిళా వీవో సంఘాలకు నూతన భవనాల నిర్మాణం కోసం సోమవారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆత్మగౌరవంతో ముందుకు సాగాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గతంలో మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అనంతరం వడ్డీలేని రుణాల విధానాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ.67 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం కల్పిస్తూ మహిళలపై నమ్మకంతో ఎలాంటి పూచీకత్తులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు.మహిళా సంఘాలకు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా శాశ్వత భవనాలు, బస్సులు, పెట్రోల్ పంపులు. సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా ఆదాయ మార్గాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, తమ సమస్యలను చర్చించుకోవడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జోగాపూర్ గ్రామంలో రెండు మహిళా సంఘాలకు భవనాలు మంజూరు కావడం సంతోషకరమని, ఐదు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.జోగాపూర్ గ్రామంలో సుమారు 53 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దీపావళి పండుగను కొత్తగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకుంటున్న లబ్ధిదారుల ఆనందం, వారి కళ్లలో కనిపించిన సంతోషం ప్రభుత్వానికి ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ నెల 19 నుంచి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భూమి ఉన్న రైతులకు మాత్రమే కాకుండా భూమిలేని పేద కుటుంబాలకు కూడా భీమా భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రేషన్ కార్డును ప్రాతిపదికగా తీసుకొని ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి అర్హులైన కుటుంబాలను పథకంలో చేర్చనున్నట్లు చెప్పారు.గత ప్రభుత్వాలు రాష్ట్రంపై భారీగా అప్పుల భారం మోపినప్పటికీ, ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

పేదలు, రైతులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.జోగాపూర్ గ్రామంతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీగా, దేవస్థానం చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉన్నానని తెలిపారు. గ్రామంలో దేవాలయాలు, పాఠశాలలు, సీసీ రోడ్లు, కుల సంఘ భవనాలు, మంచినీటి సౌకర్యాలు వంటి అనేక అభివృద్ధి పనులకు గతంలో నిధులు మంజూరు చేయించామని, భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సహజన్. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి. సింగిల్ విండో చైర్మన్లు గసికంటి ప్రభాకర్. ఎగోలపు శ్రీనివాస్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారు కుటుంబంతో దీపావళి వేడుకలు జరుపుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9:(నేటినిజం ప్రతినిధి): పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసి, వారి జీవితాల్లో భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని నింపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతగానో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వేములవాడ పట్టణం 22వ వార్డు, వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఇంట్లో లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ సంబరాల్లో పాల్గొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇంటిని నిర్మించుకున్న కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ధర్మపురి నియోజకవర్గానికి సుమారు 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే విడతల వారీగా ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు తెలిపారు.సొంతిల్లు అనేది పేద కుటుంబాలకు కేవలం నివాసం మాత్రమే కాదని, అది భద్రతకు, భరోసాకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల చిరకాల స్వప్నం సాకారమవుతోందన్నారు. దీపావళి పండుగ చీకటిని తొలగించి వెలుగులు నింపినట్లుగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలు, సంతోషాన్ని నింపుతున్నాయని అన్నారు. లబ్ధిదారు కుటుంబంతో కలిసి వారి నూతన ఇంటిలో దీపావళి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దీపావళి పండుగ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం కూడా కావడం ప్రత్యేకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంల స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9:(నేటినిజం ప్రతినిధి):, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు..ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, 'రేవంత్ అన్నా.. మీకు మా ప్రాంత ప్రజల పక్షాన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు' అంటూ ప్రత్యేక బ్యానర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం స్ఫూర్తితో పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ లక్షలాది రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని, ఒకవైపు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. రైజింగ్ తెలంగాణ లక్ష్యంతో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ఫోర్త్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడుల ఆకర్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వేములవాడ పట్టణంలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు, శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధుల కేటాయింపు, కాలికోట సూరమ్మ ప్రాజెక్టుకు రూ.80 కోట్ల నిధులు, విద్యా, వైద్య రంగాల్లో నూతన అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రాంత ప్రగతికి నిదర్శనమని అన్నారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, పబ్లిక్ స్కూల్స్, డిజిటల్ విద్యా కేంద్రాలు వంటి కార్యక్రమాలతో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తున్నారని, వేములవాడను టెంపుల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కొనియాడారు.సంక్షేమం, అభివృద్ధి, ఆధ్యాత్మికత అనే మూడు రంగాలకు సమ ప్రాధాన్యతనిస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారని అన్నారు.ఈ సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆశీస్సులు ప్రసాదించాలని, ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.వేములవాడ ప్రాంత ప్రజల పక్షాన, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, తోట రాజు, కోఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, పీర్ మహమ్మద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ తూమ్ మధు, కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్ , నాగుల విష్ణు, కనికరపు రాకేష్, పులి రాంబాబు, పాతసత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గేటుపై కాంగ్రెస్ హస్తం గుర్తు

సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల అభిమానం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు తిప్పారపు సత్తమ్మ తమ ఇంటి గేటుపై కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును ఏర్పాటు చేసి పార్టీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో ఎన్నో ఏళ్ల సొంతింటి కల నెరవేరిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొంతింట్లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆది శ్రీనివాస్‌కు లబ్ధిదారు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT SECUNDERABAD
GWOP. No. 9 OF 2025

Between:

1. Smt. Merupula Lavanya, W/o. Late Merupula Naresh Kumar Goud, aged 42 years, Occ: Household.
2. Kum. Merupula Shivani Goud, D/o. Late Merupula Naresh Kumar Goud, aged 16 years, Occ: Student, (being minor rep. by his natural guardian and mother Smt. Merupula Lavanya)
3. Kum. Merupula Harshini Goud, D/o. Late Merupula Naresh Kumar Goud, aged 7 years, Occ: Student, (being minor rep. by his natural guardian and mother Smt. Merupula Lavanya)

All are R/o. 9-2-70, Hasmathpet, Near Mazid Madasa, Old Bowenpally, Tirumalgiri, Secundera bad – 500 011.

... Petitioners

AND

1.Sri. Merupula Ajay Kumar Goud, S/o. Merupula Anantha Ramulu, Aged about: 58 years, Occ: Business,
2.Sri. Merupula Jai Kumar Goud, S/o. Merupula Anantha Ramulu, Aged about: 51 years, Occ: Business,
Both are respondnet present R/o. 9-2-70, Hasmathpet, Near Mazid Madasa, Old Bowenpally, Tirumalgiri, Secunderabad – 500 011.
3. All Concerned

...Defendants

NOTICE

Please take notice that the Petitioner/Plaintiff has filed Final Decree Proceeding before **THE COURT OF THE XII ADDITIONAL CHIEF JUD GE: CITY CIVIL COURTS: AT SECU NDERABAD** vide GWOP. No.9 of 2025 against the respond ents. The Respondents are Sri. Merupula Ajay Kumar Goud, S/o. Merupula Anantha Ramulu, and Sri. Merupula Jai Kumar Goud, S/o. Merupula Anantha Ram ulu, Both are respondnet present R/o. 9-2-70, Hasmathpet, Near Mazid Madasa, Old Bowenpally, Tirumalgiri, Secun derabad – 500 011, and all conce rned. If you have any objections to the public persons now the matter stand posted on **18-11-2026 at 10:30** a.m for your appearance either in person or through advocate, failing which matter would be decided as per Law.

-AKELLA SUBBA LAKSHMI
G.Siddappa, Advocate / Hyderabad
202, AN Misra Apartment, street No.14Himayathnagar, Hyderabad - 29 (M) 9013511755, 9985598041.

గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా

యువతకు ఉపాధి.. మహిళలకు స్వయం ఉపాధిపై ప్రత్యేక కార్యాచరణ- వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

కరీంనగర్, నవంబర్ 09: గ్రామాల సమగ్ర అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వి. నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై చర్చించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామీణ యువతలో నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని, మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడతామని పేర్కొన్నారు.

తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు ఆయనను శాలువాతో సన్మానించగా, ఆయన కూడా సర్పంచులను సత్కరించారు. కార్యక్రమంలో దుబ్బపల్లి సర్పంచ్ ఎం. ప్రశాంత్ రెడ్డి, ఫకీర్‌పేట్ సర్పంచ్ బి. లక్ష్మణ్, జూబ్లీ నగర్ సర్పంచ్ ఎస్. కమలాకర్, ఎలబోతారం సర్పంచ్ టి. రాజు, కాంగ్రెస్ నాయకులు జి. తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hydera bad-500020. Telang ana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93 @gmail.com.